ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం సెప్టెంబరు 26, 2024

లడ్డూ ప్రసాదం కల్తీ కారకులను శిక్షించాలి

జనసేన ఆధ్వర్యంలో గోవింద శంఖారావం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీకి కారణమైన దోషులను వెంటనే శిక్షించాలని కోరుతూ అమలాపురంలో బుధవారం సాయంత్రం జనసేన పార్టీ ఆధ్వర్యంలో గోవింద శంఖారావం నిర్వహించారు. కాగడాలు పట్టుకుని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి గడియార స్తంభం కూడలి వరకు భారీ ర్యాలీ చేపట్టారు. జనసేన, తెదేపా, భాజపా, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్, ఓంశాంతి కేంద్ర నాయకులు, ఇస్కాన్, అమలాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఆర్యవైశ్య, వేదమాత గాయత్రి, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు. వైకాపా పాలనను దుయ్యబడుతూ, మాజీ సీఎం జగన్ చిత్రపటాలను దహనం చేశారు. నెయ్యిలో ఆవు, పంది కొవ్వులు, చేప నూనెలు వంటి పదార్థాలతో అపవిత్రం చేసిన నిందితులను, అందుకు సహకరించిన నాయకులను కఠినంగా శిక్షించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మెట్ల రమణబాబు, బోణం సత్యవరప్రసాద్, భాజపా నాయకులు నల్లా పవన్‌కుమార్, మోకా సుబ్బారావు, కౌన్సిలర్లు గండి దేవిహారిక, పి.అమరావతి, గొలకోటి విజయలక్ష్మి, బొర్రా వెంకటేశ్వరరావు.. అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. జనసేన పార్టీ ముస్లిం ప్రతినిధులు మద్దతు పలికారు.



పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత దీక్షకు మద్దతు తెలుపుతూ..



అమలాపురంలోని గడియారస్తంభం కూడలి వద్ద నిరసన

వనం వదిలి జనారణ్యంలోకి..



- కడియం గోదావరి లంకల్లోకి చిరుత
- తాజాగా బుర్రిలంకలో అడుగుజాడలు
- గాలింపు చర్యల్లో అటవీశాఖ



ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, కడియం: దాదాపు పదిహేనురోజులపాటు రాజమహేంద్రవరం సమీప దివాన్‌చెరువు అభయారణ్యంలో సంచరించిన చిరుత పులి తాజాగా కడియం, గోదావరి లంకల్లోకి ప్రవేశించింది. దీంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. అటవీశాఖ అధికారులు ఎక్కడికక్కడ అప్రమత్తమవుతూ ప్రజలకు సూచనలు జారీచేస్తున్నారు.

దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో కొన్నాళ్లుగా తిరుగుతున్న చిరుత జాడ మూడురోజులుగా కనిపించకపోగా మంగళవారం రాత్రి కడియం మండలంలోని దోసాలమ్మ కాలనీలో ప్రత్యక్షమైంది. బుధవారం సాయంత్రం బుర్రిలంకలోని తిరుమలశెట్టి భాస్కరరావు నర్సరీ నుంచి చెక్కపల్లి పుల్లయ్య నర్సరీ వైపు వెళ్లే మార్గంలో పాదముద్రలు గుర్తించారు. సుమారు 2 కి.మీ మేర ప్రయాణం చేసినట్లు అటవీ అధికారులు గుర్తించారు. దివాన్‌చెరువు నుంచి కడియం వరకు నేరుగా అయితే సుమారు 13 కి.మీ, వేర్వేరు మార్గాల్లో అయితే దాదాపు 30 కి.మీ మేర ఇది పయనం చేసి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.


చిరుతను పట్టుకునేందుకు తెచ్చిన ప్రత్యేక బోను

కనిపిస్తే సమాచారం ఇవ్వండి

కడియపులంక చుట్టుపక్కల సమీప గ్రామాల్లో చిరుత ఆనవాళ్లు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని అటవీశాఖ అధికారులు కోరారు. వివరాలకు టోల్‌ఫ్రీ నంబరు 18004255909, అటవీశాఖ క్షేత్రాధికారి 9849156162, మానిటరింగ్ టీమ్ 9705909066 నంబర్లకు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు.

వరదలకు వచ్చిందా..

ఇటీవల వరదలకు గోదావరి పరివాహక ప్రాంతాల నుంచి దివాన్‌చెరువు వైపు చిరుత వచ్చిందన్న అభిప్రాయం ఉంది. బుర్రిలంక శివారులోని లంక ప్రాంతాల్లో జింకలు ఉన్నందున అటువైపు వెళ్లేందుకు ఎక్కువ అవకాశం ఉందని డీఎఫ్‌వో భరణి చెబుతున్నారు. ఇప్పటికే గ్రామస్థులకు అవగాహన కల్పించామన్నారు. గురువారానికి ఓ స్పష్టత వస్తుందని.. ఉన్నతాధికారులతో చర్చిస్తూ తగిన నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా సామాజిక మాధ్యమాల్లో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారిని పోలీసులకు అప్పగిస్తామని హెచ్చరించారు.

కూలీల్లో ఆందోళన..

వర్షాకాలంలో మొక్కల ఎగుమతులు, దిగుమతులతో నిత్యం రద్దీగా ఉండే కడియపులంకలో ఒక్కసారిగా నిర్మానుష్యం అలుముకుంది. నర్సరీల మధ్యగా చిరుత సంచారం నేపథ్యంలో కూలీలు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా మనిషి నిల్చొని ఉంటే చిరుత దాడి చేయదని, కూర్చొని ఉంటే జంతువుగా భావించి లంఘించే ప్రమాదం ఉందన్నది అధికారుల మాట. దాదాపు 4వేల ఎకరాల్లో ఉన్న నర్సరీల్లో 30 వేలమందికి పైగా కూలీలు, నర్సరీల రెండ్రోజులుగా ఎగుమతులు నిలిచిపోయాయని వాపోతున్నారు. పులి సంచారంతో కడియపులంక, బుర్రిలంక, వెంకాయమ్మ పేట ప్రాంతాల్లోని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.


విధుల్లో అటవీ అధికారులు, సిబ్బంది

25 కెమెరాల ఏర్పాటు..

దివాన్ చెరువు అటవీ ప్రాంతంలో చిరుత ఇక్కడే ఒక కి.మీ పరిధిలో వలయాకారంలో సంచరించడంతో వివిధ ప్రాంతాల్లో దాదాపు 100 ట్రాప్ కెమెరాలను అమర్చి పరిశీలిస్తూ వచ్చారు. ఇప్పుడు చిరుత దిశ మార్చడంతో కొంత ఏర్పాటు విషయంలో ఓ అంచనాకు రాలేకపోతున్నారు. అది సంచరిస్తున్న ప్రాంతాల్లో 20 ట్రాప్ కెమెరాలు, 5 సీసీ కెమెరాలు బిగించారు. ఎరలు సైతం ఏర్పాటుచేశారు. కడియం నర్సరీ సంఘాలతో సమావేశమై వారి వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో ఫుటేజీని పరిశీలించి జాడ కనిపిస్తే వెంటనే సమాచారమివ్వాలని సూచించారు. ప్రస్తుతం 5 బృందాలు పని చేస్తున్నాయి.



అమలుకాని మాటలు.. అంతులేని కోతలు

- వైకాపా సర్కారు నిర్లక్ష్యమే లంకలకు శాపం
- వరదలకు నదిలో కలిసిపోతున్న భూములు


సలాదివారిపాలెంలో గోదావరిలో కలిసిపోతున్న కొబ్బరి తోటలు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: గోదావరి లంక భూములు.. ఎంతో సారవంతమైన వీటిలో పంటలు చక్కగా పండుతాయి. అలాంటి ఈ నేలలు ఏటా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటికి గోదావరి గర్భంలో కలిసిపోతున్నాయి. ఊళ్లకు ఊళ్లు నదీపాతానికి గురవుతున్న పరిస్థితి. గత అయిదేళ్లలో నదీకోత నివారణకు చేపట్టిన చర్యలు శూన్యం. గత ఏడాది ఆగస్టులో వరదల వేళ ముమ్మిడివరం, అయినవిల్లి మండలాల్లో పర్యటించిన అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.150 కోట్లతో గ్రోయిన్లు, రివిట్‌మెంట్ పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి మరిచిపోయారు. అప్పట్లో ఈ పనులు చేపట్టి ఉంటే ఇటీవల వరదలకు భారీ నష్టం తప్పేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది.

ధవళేశ్వరం ఆనకట్ట నుంచి దిగువకు ప్రారంభమయ్యే గోదావరి కోనసీమలోని 16 మండలాలు, 72 గ్రామాల్లో విస్తరించి ఉంది. గౌతమి, వైనతేయ, వశిష్ట గోదావరిగా వివిధ ప్రాంతాలకు విస్తరించింది. 75 వేల ఎకరాల్లో లంక భూములు ఉండగా కొబ్బరి, కోకో, బత్తాయి, అరటి వంటి అంతర పంటలు, కూరగాయల సాగు చేపడుతున్నారు. ఐ.పోలవరం మండలం రామాలయంపేట, ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధిలోని సలాదివారిపాలెం, కూనాలంక, గురజాపులంక, తాళ్లరేవు మండలం పిల్లంక, కె.గంగవరం మండలం శేరుల్లంక గ్రామాల్లోని వందల ఎకరాలు గడిచిన పదేళ్లలో గోదావరి గర్భంలో కలిసిపోయాయి. సలాదివారిపాలెంలో ఓ పురాతన గుడి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సైతం ఇదే పరిస్థితి.

ఒక్క రూపాయీ విదల్చని వైకాపా ప్రభుత్వం

2019, నవంబరు 21: ముమ్మిడివరం మండలం కొమానపల్లికి మత్స్యకార దినోత్సవం సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వచ్చారు. ఐ.పోలవరం మండలంలోని ఎదుర్లంక వద్ద గోదావరి నదీకోత నివారణకు రూ.79.76 కోట్లతో చేపట్టే పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నాలుగున్నరేళ్ల మిన్నకుండి మొన్నటి ఎన్నికల సమయంలో హడావిడిగా టెండర్లు ఖరారు చేసి నాలుగు రాళ్లు వేసి వదిలేశారు.

❖ 2023, ఆగస్టు 8: ముమ్మిడివరం, అయినవిల్లి మండలాల్లోని లంక గ్రామాల్లో జగన్ పర్యటించారు. భూములు నదీపాతానికి గురికాకుండా రూ.150 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పొట్టిలంకలో 1000 మీటర్లు, ఠాణేలంకలో 400, గురజాపులంకలో 600, కూనాలంకలో 800, వివేకానంద వారధి వద్ద 300, కొండకుదురులంకలో 400 మీటర్లు వెరసి 3.5 కి.మీ. మేర రివిట్‌మెంట్ నిర్మాణం చేపడతామని వెల్లడించారు. టెండర్లు పూర్తి చేస్తామని.. కచ్చితంగా రెండు నెలల్లో పనులు ప్రారంభించి జిల్లా కలెక్టర్ తనకు ఫొటోలు పంపించాలని డాంబికాలు పలికారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. దీంతో ఈ ఏడాది జులైలో వచ్చిన భారీ వరదలకు పెద్దఎత్తున భూములు నదీపాతానికి గురయ్యాయి. ప్రస్తుతం లంక గ్రామాల ఆశలన్నీ కూటమి ప్రభుత్వంపైనే ఉన్నాయి. ఇక్కడి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.


గురజాపులంకలో నదీపాతానికి గురవుతున్న లంక భూమి

గుంతల మార్గం.. నరకమే ప్రయాణం


సుంకరపాలెంలో పెద్ద పెద్ద గుంతలతో ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

కోనసీమ, కాకినాడ జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు కీలకమైన ఆర్అండ్‌బీ మార్గమది. తాళ్లరేవు మండలం సుంకరపాలెం-ఇంజరం వరకు భారీ గుంతలతో నరకం చూపిస్తోంది. యానాం నుంచి రామచంద్రపురం వెళ్లే వాహనాలు ఇటుగానే ప్రయాణం సాగించాలి. ఆధునికీకరణ పనులకు ప్రతిపాదనలు తయారుచేశామని ఆర్అండ్‌బీ జేఈ లక్ష్మీప్రసన్న తెలిపారు. -న్యూస్‌టుడే, తాళ్లరేవు

భూముల వివరాలు నమోదు చేయాలి

అమలాపురం కలెక్టరేట్: జిల్లాలో డి.పట్టాలు జారీ చేసి 20 సంవత్సరాలు పూర్తయిన భూములకు సంబంధించి ఉచిత హక్కులు కల్పించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. అసైన్డ్ భూములు, 22ఏ సర్వే నంబర్లలో ఉన్నవి, ఇనాం భూములపై సమీక్ష నిర్వహించారు. డి.పట్టా భూముల్లో హక్కుదారులు ఉన్నారా? లేదా వారి వారసుల ఆధీనంలో ఉన్నాయా? లేదా ఇతరుల చేతుల్లోకి వెళ్లాయా? అనే సమగ్ర వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ నిశాంతి, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు కేశవర్ధన్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బరువు తగ్గి.. భారం పెరిగి..

గ్యాస్ సిలిండర్ల సరఫరాలో నిబంధనలకు నీళ్లు

● అల్లవరానికి చెందిన వెంకటేశ్వరరావు కుటుంబానికి ఒక గ్యాస్ సిలిండర్ రెండు నెలలపాటు సరిపోయేది. అటువంటిది గత రెండు పర్యాయాలుగా 45 రోజుల కంటే ముందే సిలిండర్ ఖాళీ అయిపోతోంది. అనుమానం వచ్చి కొత్త సిలిండర్ తీసుకొచ్చినప్పుడు బరువు చూడాలని డెలివరీ బాయ్‌ని కోరగా.. కాటా లేదని చెబుతూనే, దానికి ఉన్న సీల్ చూపిస్తూ అంతా సక్రమంగా ఉంటుందని వాదించడంతో మిన్నకుండిపోయారు.


● ప్రస్తుతం వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.835 ఉంది. అమలాపురం పట్టణంలో ఓ నివాసం వద్దకు ద్విచక్ర వాహనంపై సిలిండర్ తీసుకెళ్లిన బాయ్ మాత్రం రూ.890 ఇవ్వాలని అడిగాడు. ఇదేమిటంటే డెలివరీ ఛార్జి అని దబాయించడంతో మారు మాట్లాడకుండా అతను అడిగినంతా ఇచ్చేశారు.

..ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. నిత్యం ఇటువంటి సంఘటనలు జిల్లాలో జరుగుతూనే ఉన్నాయి. ఎవరికి చెప్పాలో తెలియక, చెబితే ఆ తరువాత గ్యాస్ సకాలంలో సరఫరా చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తారమోననే భయం వినియోగదారులను వెంటాడుతోంది.

– న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా కొన్ని గ్యాస్ సంస్థల ఏజెన్సీల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా సిలిండర్లను దొడ్డిదారిన అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇళ్లకు సరఫరా చేసే సిలిండర్లకు సీలు వేసి ఉన్నా అందులోని గ్యాస్ కొంత మొత్తంలో తీసేసి దానిని బహిరంగ మార్కెట్లో కిలో రూ.150 చొప్పున అమ్ముకొని కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం సిలిండర్లు సరఫరా చేసే సమయంలో ఖచ్చితంగా బరువు తూచే యంత్రాన్ని వెంట తీసుకెళ్లాలి. కాని క్షేత్రస్థాయిలో అవి ఎక్కడా కనిపించడం లేదు. దీంతో పాటు బుక్ చేసుకున్న వినియోగదారులకు నిర్ణీత సమయంలోగా బండ అందించాల్సి ఉండగా వివిధ కారణాలను సాకుగా చూపుతూ ఆలస్యం చేస్తూ.. వాటిని బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు తూనికల కొలతల అధికారులు గ్యాస్ గోదాములపై దాడులు నిర్వహించి 16 కేసులు నమోదు చేసి, రూ.2.30 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశారు.


గ్యాస్ గోదాములో తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీ (పాత చిత్రం)



జిల్లాలో ఇలా..

జిల్లాలో వివిధ గ్యాస్ సంస్థల ఏజెన్సీలు 91 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో 6,10,042 కనెక్షన్లున్నాయి. ఆయా ఏజెన్సీల ద్వారా రోజుకు సుమారు 6 వేల సిలిండర్లు విక్రయిస్తున్నారు. 14.2 కిలోల బరువు ఉన్న సిలిండర్ ధర రూ.840. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గృహాల్లో వినియోగించే సిలిండరులో ఒక శాతం అంటే 150 గ్రాములు, వాణిజ్య సిలిండర్‌లో 190 గ్రాముల వరకు బరువులో వ్యత్యాసం ఉండొచ్చు. ఏజెన్సీల పరిధిలో అయిదు కి.మీ. లోపల ఉండే వినియోగదారులకు అదే ధరకు చెల్లించాలి. జిల్లాలో మాత్రం అందుకు విరుద్ధంగా రూ.890 వరకు వసూలు చేస్తున్నారు. అదేమిటి అని అడిగితే రవాణా ఛార్జి అంటున్నారు.

వినియోగదారుల హక్కులివి..

● ఆన్‌లైన్‌లో గ్యాస్ బుక్ చేసిన వారికి డెలివరీ తేదీ సంక్షిప్త సమాచారం రూపంలో వస్తుంది. ఆ రోజు అందించకపోతే కారణం అడిగే హక్కు ఉంది. ● సిలిండర్‌కు ఉన్న సీల్ సరిగా లేకపోయినా వెనక్కి ఇచ్చేయొచ్చు. ● బరువులో తేడా ఉందని అనిపిస్తే తూకం వేయమని అడిగే హక్కు ఉంది. ● సిలిండర్ వాచర్, పిన్‌లో ఏదైనా తేడా ఉంటే మార్పు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ● డెలివరీ సమయంలో ఎటువంటి అదనపు రుసుం చెల్లించాల్సిన పనిలేదు. బలవంత పెడితే బిల్లు అడగవచ్చు. ● వీటన్నింటిపై ఆన్‌లైన్‌లో గ్యాస్ బుక్ చేసే సమయంలో ఫిర్యాదు చేయవచ్చు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

గ్యాస్ వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి ఒక్కరూ సిలిండరు తీసుకునే సమయంలో బరువు చూసుకోవచ్చు. ఇంటికి తీసుకొచ్చే వారికి ఎటువంటి అదనపు రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు.

- పాపారావు, డీఎస్‌వో

పైరు కాదిది.. ముంచేసే కలుపు



కోనసీమలోని చాలా ప్రాంతాల్లో రైతులు ముంపు కష్టాలను తట్టుకోలేక చేలను ఖాళీగా వదిలేశారు. వాటిల్లో గుర్రపుడెక్క, కలుపు మొక్కలు పెరిగి అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ఉప్పలగుప్తం వానపల్లిపాలెం దారిలో ఖాళీగా వదిలేసిన చేలల్లో కలుపు, తూడు పెరిగి ఏపుగా పెరిగిన పైరులా, పచ్చని తివాచీని తలపిస్తుంది. కలుపు పెరిగిన చేలల్లో రబీసాగుకు పెట్టుబడి అధికమవ్వడమే కాక, దిగుబడి సైతం తగ్గుతుందని రైతులు వాపోతున్నారు. ఈ చిత్రం తొలకరిసాగును వదులుకున్న రైతుల దుస్థితికి అద్దం పడుతోంది. - న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

అనుమతుల్లేని ఆక్వా చెరువులకు విద్యుత్తు కట్


సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో అనధికారికంగా సాగు చేస్తున్న రొయ్యల చెరువులకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మత్స్య, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మలికిపురం, రాజోలు, మామిడికుదురు మండలాల్లో 688 ఎకరాల్లో సాగు అవుతున్న చెరువులపై అధికారులు బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహించారన్నారు. సముద్ర తీరానికి 200 నుంచి 500 మీటర్ల లోపల ఉన్న చెరువులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వీటికి సంబంధించి ఎన్జీటీ ఇచ్చి తీర్పుపై మత్స్యశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తీరం వెంబడి అనధికారికంగా సాగు అవుతున్న వాటిపై అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ అనధికారిక రొయ్యల చెరువులకు విద్యుత్తు సరఫరా నిలుపుదలకు సంబంధించి అధికారులకు పోలీస్ రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ నిశాంతి, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్, ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, ట్రాన్స్‌కో ఈఈ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జొన్నాడ పైవంతెన పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

216 జాతీయ రహదారిపై జొన్నాడ వద్ద రూ.120 కోట్లతో నిర్మిస్తున్న పైవంతెన(ఫ్లైఓవర్) పనులు త్వరిగతిన పూర్తి చేసి వచ్చే ఏడాది జనవరి నాటికి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో వంతెన నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో జాప్యం లేకుండా ఇంజినీర్లు పర్యవేక్షించాలన్నారు. ఈ పనులపై ప్రతి 15 రోజులకు ఒక సారి సమీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు అవసరమైన మట్టిని ప్రభుత్వపరంగా సమకూర్చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ నిశాంతి, సురేంద్రనాథ్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆ రెండున్నర కిలోమీటర్లే సమస్య..!

న్యూస్‌టుడే, మామిడికుదురు, రాజోలు

216 జాతీయ రహదారికి రాజోలు మండలం శివకోటి నుంచి మామిడికుదురు మండలం పాశర్లపూడి వరకు తలపెట్టిన బైపాస్ రోడ్డు పేరు చెబితేనే గత వైకాపా పాలకుల నిర్లక్ష్యం కనిపిస్తుంది. జాతీయ రహదారుల నిర్మాణాలు, విస్తరణ పరంగా ఎదురైన సమస్యలపై స్పందించిన సీఎం చంద్రబాబు దీనిపై ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటుకు ఆదేశించడంతో తుది దశ పనులు వేగవంతం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

శివకోటి నుంచి పాశర్లపూడి వరకు రూ.132 కోట్ల వ్యయంతో 20.8 కిలోమీటర్ల మేర 10 మీటర్ల వెడల్పుతో బైపాస్ రోడ్డుకు గాను చేపట్టిన పనులు అడ్డంకులున్న చోట్ల గత మూడేళ్లుగా నిలిచిపోయాయి. ఇప్పటి వరకు 18 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు జరగ్గా, ఒక ప్రధాన వంతెన సహా 24 చోట్ల కల్వర్టు పనులు పూర్తి చేశారు. మరో వంతెన, కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మామిడికుదురులోని హైస్కూల్ సమీపంలో 109/700 నుంచి వైకాలపేట వరకు దాదాపు 2.5 కిలోమీటర్ల మేర పనులు నిలిచిపోయాయి. ఇక్కడ నివాసయోగ్యమైన స్థలాలు ఉన్నందున మార్గాన్ని మార్పు చేయాలని స్థానిక రైతులు 2017లో కోర్టును ఆశ్రయించారు. అయితే బైపాస్ రోడ్డు దాదాపు పూర్తికావస్తున్నందున అక్కడి స్థలాలు ఇవ్వడం అనివార్యమని అధికారులు స్పష్టం చేయడంతో తమకు చదరపు గజాల్లో పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో కలెక్టర్, రెవెన్యూ ఉన్నతాధికారులు దీనిపై పరిశీలన చేసి దస్త్రాలను సిద్ధం చేసినా ఆ దిశగా ఆశించినంతగా ముందడుగు పడకపోవడంతో ఇప్పటికీ ఆ సమస్య అపరిష్కృతంగా ఉండిపోయింది. ప్రస్తుతం అక్కడ్నించి ముందుకు వెళ్లే అవకాశం లేకపోవడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. గెద్దాడ వద్ద కొంత మేర ఇదే సమస్య పరిష్కారానికి దూరంగా ఉంది. ఇప్పటికే ఈ రోడ్డులో గెద్దాడ-మొగలికుదురు నుంచి శివకోటి వరకు నిత్యం వాహనాల రాకపోకలు సాగిపోతున్నాయి. ఈ కాసింత దూరం రోడ్డు సమస్య పరిష్కారమైతే బైపాస్ రోడ్డు పూర్తిగా వినియోగంలోకి రానుంది. దీనివల్ల మామిడికుదురు, తాటిపాక, పొదలాడ, రాజోలు మీదుగా సాగే వాహనాల రాకపోకలు చాలా వరకు బైపాస్ రోడ్డుకు వెళ్లడం వల్ల రద్దీతో పాటు దూరభారం చాలా వరకు తగ్గనుంది.


మామిడికుదురు వద్ద నిలిచిపోయిన 216 బైపాస్ రోడ్డు పనులు

ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది

బైపాస్ రోడ్డు 18 కిలోమీటర్ల మేర పూర్తయింది. వాటి మధ్యలో 24 కల్వర్టులు, ఒక వంతెన పనులను పూర్తి చేశాం. మిగతా రెండు కల్వర్టుల పనులు చేపడుతున్నాం. రైతులు కోర్టుకు వెళ్లడం, పరిహారం తీసుకోకపోవడంతో కొంత మేర పనులు నిలిచిపోయాయి. దీనికి సంబంధించి ఉన్నతాధికారులు పరిశీలన చేస్తున్నారు. రైతులతో చర్చించి పరిహారం కేటాయింపులు పూర్తికాగానే తుది దశ పనులు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. - పురుషోత్తం, ఏఈఈ, ఎన్.హెచ్.

రబీలోగా రైతు సమస్యలు పరిష్కరించాలి: మంత్రి సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: వచ్చే రబీ సీజన్‌లోగా రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశించారు. కాలువల్లో గుర్రపుడెక్క, తూడు తొలగింపు, లాకులు, స్లూయిస్‌ల వద్ద షట్టర్లకు మరమ్మతులు చేసే చర్యలు చేపట్టాలని సూచించారు. బుధవారం రామచంద్రపురం పట్టణంలోని లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. పట్టణం నుంచి ఇద్దరు, ఒక్కో మండలం నుంచి ముగ్గురు రైతులు, రైతు సంఘాల సభ్యులతో నియోజకవర్గ స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని అన్నదాతలకు సూచించారు. కొందరు రైతులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. రహదారులు భవనాల శాఖ ఈఈ రాము, రామచంద్రపురం తెలుగు రైతు విభాగం అధ్యక్షుడు శివప్రసాద్, జలవనరులు, వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, డ్రెయిన్లు తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. గరిగిపాటి సూర్యనారాయణ, పోలిశెట్టి చంద్రశేఖర్, రైతు విభాగం నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సుభాష్

పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు



శరవేగంగా ఆన్‌లైన్ ప్రక్రియ

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో నిర్వీర్యమైపోయిన పంచాయతీరాజ్ వ్యవస్థను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా గ్రామ పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపులకు కార్యాచరణ చేపట్టింది. పన్నుల వసూళ్లు ఎన్నో ఏళ్లుగా పంచాయతీ సిబ్బంది మాన్యువల్‌గానే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అక్రమాలకు పాల్పడుతున్న పరిస్థితులు బయటపడుతున్నాయి. వీటికి చెక్ పెట్టడానికి, పారదర్శక వసూళ్లకు డిజిటల్ చెల్లింపుల విధానాన్ని వేగవంతం చేస్తోంది. ఈ డిజిటల్ చెల్లింపుల ప్రక్రియ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం గతంలో ఆదేశించినా గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. మూడు వేల లోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో చెల్లింపులకు క్యూఆర్ కోడ్, మూడు వేల దాటిన పంచాయతీల్లో ఈపోస్ యంత్రాల ద్వారా నగదు రహిత చెల్లింపులు చేయాలని హడావిడి చేశారు. కోనసీమ జిల్లాలో 385 గ్రామ పంచాయతీలకు గాను 62 పంచాయతీల్లో మాత్రమే క్యూఆర్ కోడ్ తీసుకువచ్చారు.

పైలట్ ప్రాజెక్టుగా 6 గ్రామాల ఎంపిక..

ఉమ్మడి జిల్లాలో 1100 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో నగదు రహిత చెల్లింపుల వ్యవస్థను తీసుకువచ్చేందుకు ఆరు గ్రామ పంచాయతీలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి కార్యాచరణ చేపట్టారు. ప్రభుత్వం రూపకల్పన చేసిన apcfss వెబ్ పోర్టల్‌లో ఆయా గ్రామ పంచాయతీల వివరాలను నమోదు చేస్తున్నారు. గ్రామంలో ఉన్న గృహాలు వాటికి చెల్లించే ఆస్తి, కొళాయి పన్ను వివరాలు, దుకాణ సముదాయాలు, లేఅవుట్లు, భవన నిర్మాణాల అనుమతులు, కొబ్బరిచెట్లు, చెరువులు, ఆధార్, సర్వేనంబర్లు, సరిహద్దు వివరాలతో సహా పంచాయతీకి చెల్లించాల్సిన అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసి ప్రభుత్వ వెబ్ పోర్టల్‌కు అనుసంధానం చేస్తున్నారు. ఈ డిజిటల్ వెబ్ పోర్టల్‌లో పేమెంట్ గేట్ వే ద్వారా ప్రజలు పన్నులను చెల్లించే వెసులుబాటు ఉంటుంది. ఇదే కాకుండా క్యూఆర్‌కోడ్, డెబిట్, క్రెడిట్ కార్డులను సైతం వినియోగించి పన్ను చెల్లించే అవకాశం కల్పిస్తున్నారు.


అల్లవరం గ్రామ పంచాయతీలో ఆన్‌లైన్ ప్రక్రియ చేస్తున్నారిలా..

● జిల్లా	■ మొత్తం పంచాయతీలు
◆ ఎంపికైన గ్రామాలు	
● తూర్పుగోదావరి	■ 303
◆ 02 (దారవరం, కాపవరం)	
● కాకినాడ	■ 412
◆ 02 (దుర్గాడ, సిరివాడ)	
● కోనసీమ	■ 385
◆ 02 (అల్లవరం, అర్తమూరు)	

విడతల వారీగా అన్ని గ్రామాల్లోనూ..

పంచాయతీల్లో పారదర్శక వ్యవస్థను తీసుకువచ్చే క్రమంలో ప్రభుత్వం నగదు రహిత చెల్లింపులకు ఆన్‌లైన్ పోర్టల్ తీసుకువచ్చింది. పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన గ్రామ పంచాయతీల్లో ఆన్‌లైన్ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. విడతల వారీగా అన్ని పంచాయతీల్లోనూ అమలు చేస్తాం. - డి.రాంబాబు, జిల్లా పంచాయతీ అధికారి

ఈపీఎఫ్‌వో 'నిధి ఆప్‌కే నికత్' రేపు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని ఆయా జిల్లాల్లో 'నిధి ఆప్‌కే నికత్' శిబిరాలు ఈ నెల 27న నిర్వహించనున్నట్లు సహాయ పీఎఫ్ కమిషనర్ వై.డి.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి రాజానగరంలోని లెనోరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ వద్ద జరుగుతుందన్నారు. కోనసీమ జిల్లాకు సంబంధించి ముమ్మిడివరంలోని పీఏసీసీఎస్, అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి వై.రామవరం మండలం పి.యర్రగొండ ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, గంగవరం మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, మారేడుమిల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఈ శిబిరాలు జరుగుతాయన్నారు. ఆయా జిల్లాల పరిధిలోని పీఎఫ్ ఖాతాదారులు, పింఛనుదారులతో పాటు ఎస్టాబ్లిష్‌మెంట్లు పాల్గొని ఫిర్యాదులు అందించవచ్చని, పింఛనుదారులు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌లు సమర్పించవచ్చని సహాయ పీఎఫ్ కమిషనర్ పేర్కొన్నారు.

చిరుత కదలికలపై మంత్రి ఆరా

కడియం, న్యూస్‌టుడే: కడియంలోని నర్సరీల పరిసరాల్లో చిరుత సంచరిస్తున్న నేపథ్యంలో స్థానికులు, అధికారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. బుధవారం కడియం విచ్చేసిన మంత్రి అటవీ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. చిరుత పాదముద్రలు లభించిన కారణంగా ఇతరత్రా చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, రక్షణ, భద్రతా ఏర్పాట్లపై ఆయన వారితో చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చిరుత కదలికలపై ఇప్పటికే నిఘా ఉంచామన్నారు. కడియం పరిసర ప్రాంతాలను పూర్తిగా జల్లెడపడుతున్నామని, క్రూరమృగాన్ని పట్టుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. త్వరలోనే పట్టుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లోని ప్రజలు ఆందోళన చెందవద్దని, అధికారులు అండగా ఉంటారని మంత్రి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ముద్రగడ జెమీ, వెలుగుబంటి రఘురామ్, చెక్కపల్లి మురళీకృష్ణ, ఆదిమూలం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.


కడియంలో అటవీ శాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

శిరస్త్రాణం ధరించడం చోదకుల బాధ్యత

దానవాయిపేట(రాజమహేంద్రవరం): శిరస్త్రాణం ధరించడంతో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టాన్ని తగ్గించే అవకాశాలు ఉన్నాయని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. బుధవారం రాజమహేంద్రవరం జిల్లాకోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల నివారణ, శిరస్త్రాణం ఆవశ్యకతపై ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడపడం ప్రమాదకరంతో పాటు చట్టరీత్యా నేరమన్నారు. అతివేగం ప్రమాదమని, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. శిరస్త్రాణం అనేది తలపై బరువుగా భావించకుండా బాధ్యతగా భావించాలన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నతికి చేరాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో సమకూర్చిన శిరస్త్రాణాలను పంపిణీ చేశారు. ఈ సదస్సులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.రామచంద్రరావు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎ.విశ్వేశ్వరరావు, డిప్యూటీ రీజనల్ హెడ్ డి.రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత తదితరులు


తిరుపతి లడ్డూ కల్తీపై మలికిపురంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిరసన యాత్ర చేస్తున్న భక్తులు

లడ్డూను అపవిత్రం చేసిన వారిని శిక్షించాలి

మలికిపురం, న్యూస్‌టుడే: పవిత్రమైన తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని జంతు కొవ్వుతో అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ప్రభుత్వ మాజీ విప్(శాసనమండలి) రుద్రరాజు పద్మరాజు కోరారు. తిరుపతి అపవిత్రతకు నిరసనగా హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని గుడిమెళ్లంక వంతెన కూడలి నుంచి కనకదుర్గమ్మ ఆలయం కూడలి, వినాయకుడి ఆలయం కూడలి, సాయిబాబా ఆలయం కూడలి మీదుగా ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. హిందువుల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. గత ప్రభుత్వం హిందువుల మనోభావాలకు భంగం కలిగే విధంగా లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యిని వినియోగించడం దారుణమని పలువురు అన్నారు. నిందితులను త్వరగా గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తిరుపతి లడ్డు అపవిత్రతకు ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన పవన్‌కల్యాణ్‌కు మద్దతు తెలిపారు. హిందూ ధర్మరక్షణ సమితి, స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు, హిందూ భక్తులు తదితరుల పాల్గొన్నారు.

ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈగా రాజబాబు

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈగా ఎస్.రాజబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈదరపల్లిలోని విద్యుత్తు శాఖ కార్యాలయంలో ఆయనను ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టెక్నికల్, కన్‌స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా వై.విజయానంద్, రామచంద్రాపురం ఆపరేషన్స్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా మల్లిక బాధ్యతలు స్వీకరించారు.


ఎస్‌ఈకి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఈఈ రవికుమార్

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ప్రసాద్

అమలాపురం పట్టణం: జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఎస్‌కేవీడీ ప్రసాద్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ప్రసాద్ సామర్లకోట మద్యం గోదాము డీఎంగా పని చేస్తున్నారు.

ఏఎఫ్‌డీ ట్రస్టుపై విచారణకు కమిషన్ నియామకం

మలికిపురం, న్యూస్‌టుడే: మలికిపురంలోని అంతర్వేదిపాలెం ఫిర్కా డెవలప్‌మెంట్ ట్రస్టు(ఏఎఫ్‌డీటీ)లో అవకతవకలపై విచారణకు ముగ్గురు సభ్యుల కమిషన్ నియమిస్తూ ఏపీఎస్‌సీహెచ్‌ఈ(ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్) ఉత్తర్వులు ఇచ్చింది. ఈ కమిటీలో కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టరు డాక్టర్ సి.కృష్ణ(గుంటూరు), ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డి.జ్యోతిర్మయి (ఇంగ్లిష్ విభాగం), ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్(గుంటూరు)లు సభ్యులుగా ఉంటారు. ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థల్లోని ఎమ్వీఎన్, జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన అధ్యాపకులు జీతాలు ఇవ్వాలని గత పదిహేను రోజులుగా ఆందోళన చేపట్టారు. పాలకవర్గ కరస్పాండెంట్, సభ్యులు ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారంటూ అధ్యాపకులు ఆరోపణలు కూడా చేశారు. ఈ నేపథ్యంలో ఏఎఫ్‌డీ ట్రస్టును రద్దు చేసి ప్రత్యేక అధికారిని నియమించాలని, పాలకవర్గ ఆర్థిక అవకతవకలపై విచారణ జరపాలని, అధ్యాపకులకు జీతాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఏపీఎస్‌సీహెచ్‌ఈని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏపీఎస్‌సీహెచ్‌ఈ ముగ్గురు సభ్యులతో విచారణ చేసి నివేదిక సమర్పించాలని కోరుతూ ఏపీఎస్‌సీహెచ్‌ఈ ఛైర్మన్ ముగ్గురు సభ్యుల కమిటీని నియమించారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

అమలాపురం కలెక్టరేట్: ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ప్రతి హామీ అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జంగా గౌతమ్, జగతా శ్రీనివాస్, అయితాబత్తుల సుభాషిణి, ఒంటెద్దు బాబి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

నేటితో ముగియనున్న క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

మసీదుసెంటర్(కాకినాడ): కాకినాడ జీజీహెచ్‌లో నిర్వహిస్తున్న గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు బుధవారం కొనసాగాయి. 108 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 23న ప్రారంభమైన ఈ పరీక్షలు గురువారంతో ముగియనున్నాయి. వైద్యులు జీన్ టాల్బర్ట్ ఫాకోగ్, డా.సమత, వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహించారు.

కాకినాడలో.. 6 రాష్ట్రాల ఫోరెన్సిక్ నిపుణులు

మూడు రోజుల పాటు సదస్సు

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: సౌత్ ఇండియా మెడికో లీగల్ అసోసియేషన్ (ఎస్ఐఎంఎల్ఏ) 20వ వార్షిక కాన్ఫరెన్స్-2024 కాకినాడలో నిర్వహిస్తున్నారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో కాకినాడ రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ) ఆడిటోరియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దక్షిణాది రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, గోవా నుంచి సుమారు 500 మందికి పైగా ఫోరెన్సిక్ వైద్యులు, వైద్య విద్యార్థులు హాజరుకానున్నారు. ఉత్తర భారతదేశ రాష్ట్రాల నుంచీ కొంతమంది వైద్యనిపుణులు వస్తున్నారని ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డా.నరసింహం తెలిపారు.


సదస్సు నిర్వహించే ఆర్ఎంసీ ఆడిటోరియం

నేర నిర్ధారణలో ఫోరెన్సిక్ సైన్స్


నేర నిర్ధారణలో న్యాయ వ్యవస్థకు ఫోరెన్సిక్ మెడిసిన్ నిపుణులు సాంకేతికత సహకారం అందిస్తారు. ఇందులో పోస్టుమార్టం నివేదిక ప్రధానం. ఎముకల ద్వారా వయసు, లింగ నిర్ధారణ చేస్తారు. హత్య, అత్యాచారం కేసుల్లో నమూనాలను సేకరించేందుకు ఈ సైన్స్ దోహదపడుతుంది.

నిపుణుల ప్రసంగాలు

మూడు రోజుల సదస్సులో 14 మంది ఫోరెన్సిక్, లీగల్ నిపుణులు ప్రసంగిస్తారు. ఈ విభాగంలో నూతన పోకడలు, అత్యాధునిక సాంకేతికతను వివరిస్తారు. వైద్య విద్యార్థులకు క్విజ్, సైంటిఫిక్ పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు ఉంటాయి.

ఏర్పాట్లు పూర్తి...

మొదటి రోజు నిరంతర వైద్య విద్య(సీఎంఈ) జరుగుతుంది. అతిథులుగా ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా.వి.రాధికారెడ్డి, డా.జి.రఘునందన్ పాల్గొంటారు. తర్వాత రెండు రోజుల సదస్సుకు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ హాజరవుతారు. సీఎంఈ, సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం.


-డా.పి.ఉమామహేశ్వరరావు, ఎస్ఐఎంఎల్ఏ ఆర్గనైజింగ్ ఛైర్మన్

500 మందికి పైగా రాక

ఈ సదస్సును తొలిసారిగా ఆర్ఎంసీలో నిర్వహిస్తున్నాం. దక్షిణాది రాష్ట్రాల నుంచి 500 మందికి పైగా వైద్యనిపుణులు, వైద్యవిద్యార్థులు హాజరుకానున్నారు. గురువారం స్పాట్ రిజిస్ట్రేషన్ సైతం ఉంటుంది.


-డా.ఫణికిరణ్, ఎస్ఐఎంఎల్ఏ ఆర్గనైజింగ్ కార్యదర్శి

రిలయన్స్ క్విజ్ పోటీలు డిసెంబరు 5న

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కేజీడీ-6 కాకినాడ ఆధ్వర్యంలో రిలయన్స్ ధీరూభాయ్ అంబాని క్విజ్ పోటీలు డిసెంబరు 5న రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో నిర్వహిస్తున్నట్లు డీఎస్ఈఓ కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలకు సంబంధించిన గోడపత్రికలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చని, జట్టుకు ఇద్దరు చొప్పున ప్రతి పాఠశాల నుంచి రెండు జట్లు పాల్గొనవచ్చన్నారు. ఈ సదావకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ కనకరాజు, సీఎంవో శ్రీనివాసరావు, రిలయన్స్ సీఎస్ఆర్ ప్రతినిధి పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 0884-3577222లో సంప్రదించవచ్చన్నారు.

వరద బాధితులకు రూ.10 లక్షల సహాయం

తుని, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం శ్రీప్రకాష్ విద్యాసంస్థల తరపున రూ.10 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. ఈ చెక్కును ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన క్యాంపు కార్యాలయంలో విద్యాసంస్థల డైరెక్టర్ చిట్టూరి విజయ్‌ప్రకాష్ మంగళవారం రాత్రి అందజేశారు. వరదల్లో తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకునేందుకు తమ వంతు బాధ్యతగా ఈ విరాళాన్ని ఇచ్చినట్లు విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ సీహెచ్‌వికె నరసింహరావు తెలిపారు.



ఉప ముఖ్యమంత్రి పవన్‌కు చెక్కు అందిస్తున్న విజయ్‌ప్రకాష్

దత్తపుత్రికపై అత్యాచారం కేసులో రెండేళ్లకు అరెస్టు

పామర్రు, న్యూస్‌టుడే: దత్తత కుమార్తెపై అత్యాచారం చేసిన కామాంధుడుని రెండేళ్లకు కె.గంగవరం పోలీసులు బుధవారం విజయవాడలో అరెస్టు చేశారు. ఎస్సై షేక్ జానీబాషా తెలిపిన వివరాల ప్రకారం, డాక్టరు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కె.గంగవరంలో రైల్వే కాలనీకి చెందిన దత్తత బాలికపై మద్యం మత్తులో తండ్రి పలుమార్లు అత్యాచారం చేశాడు. ఆమె గర్భం దాల్చడంతో అబార్షన్ చేయించేందుకు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చాడు. బాలిక జరిగిన విషయాన్ని వైద్యులకు తెలియజేయడంతో వారు పంజాగుట్ట పోలీసులకు సమాచారం చేరవేశారు. ఈ విషయం తెలుసుకున్న తండ్రి పరారయ్యాడు. 2022 సెప్టెంబరులో పోలీసులు కేసు నమోదు చేసి అంబేడ్కర్ కోనసీమ జిల్లా పామర్రు స్టేషనుకు బదిలీ చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న తండ్రి కోసం పోలీసులు గాలిస్తున్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి ఆర్టీసీ కాలనీలో నిందితుడిని ఎట్టకేలకు పట్టుకున్నారు. బుధవారం అతడిని అరెస్టు చేసినట్టు ఎస్సై తెలిపారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణలు పామర్రు ఎస్సై బాషా, సిబ్బందిని అభినందించారు.

అంతర్రాష్ట్ర నేరస్థుడి అరెస్టు

400 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

రాజమహేంద్రవరం నేరవార్తలు: ఒకటి కాదు.. రెండుకాదు.. ఏకంగా 44 కేసుల్లో నిందితుడు.. 14 కేసుల్లో జైలుకు వెళ్లాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జైలునుంచి విడుదలయ్యాడు. గత నెలలో భారీ చోరీచేసి తిరిగి పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర నేరస్తుడిని తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ డి.నరసింహకిశోర్ రాజమహేంద్రవరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా జగన్నాథపురం ఏటిమొగకి చెందిన పొన్నాడ రవిశంకర్ అలియాస్ వీరబాబు రాజమహేంద్రవరం ఏవీఏ రోడ్డులోని కోటభాస్కరమ్మనగర్‌లో నివాసముంటున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 22, విశాఖ పరిధిలో 16, తూర్పుగోదావరిలో 2, శ్రీకాకుళంలో 2, విజయనగరంలో ఒకటి, అనకాపల్లిలో ఒకటి మొత్తం 44 చోరీ కేసుల్లో నేరస్తుడు. గతనెల 26 రాత్రి కొవ్వూరు పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకు వీధిలో మహమ్మద్ మహారాజ్ అపార్టుమెంట్‌లోని కట్టా ఉషశ్రీ ఫ్లాటులోకి చొరబడి సుమారు 400 గ్రాముల బంగారు ఆభరణాలు, ద్విచక్రవాహనం చోరీ చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన సీఐలు పి.విశ్వం, కె.విజయ్‌బాబు, ఎస్సైలు పి.రవీంద్రబాబు, కె.జగన్మోహనరావు రెండు బృందాలుగా కేసు దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో ఇటీవల కొవ్వూరు పట్టణంలోని నిడదవోలు బస్టాపులో నిందితుడు వీరబాబు, అతడికి సహకరించిన లంకలపల్లి నాగరాజును అరెస్టు చేశారు. చోరీ సొత్తును భీమవరంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ నుంచి రికవరీ చేశారు. వీరబాబు చోరీచేసిన రూ.15.30 లక్షల విలువజేసే 400 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు ద్విచక్రవాహనాన్ని రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. రెండో నిందితుడైన నాగరాజు భీమవరం పట్టణంలోని పాలూరివారి వీధిలో నివాసముంటూ భీమవరం స్టేషన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్, పాలకోడేరు స్టేషన్ పరిధిలో హత్యాయత్నం కేసుల్లో జైలుశిక్ష అనుభవించి గత ఏప్రిల్ నెలలో విడుదలయ్యాడన్నారు. కేసుల్లో ప్రతిభ చూపిన పలువురు సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహకిశోర్

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,500
పాతకాయ: గండేరా	18,000
గటగట	15,000
కొత్తకాయ: గండేరా	17,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	17,000-18,000
కొత్త (పచ్చి) కాయ	17,000-17,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,375
కిలో	225

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.


వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ.లో

ఫారంరేటు	121-00
రిటైల్ లైవ్	143-00
డ్రెస్డ్	207-00
స్కిన్‌లెస్	236-00

కాయలకే కాదు.. కొబ్బరి డొక్కకు గిరాకీనే

న్యూస్‌టుడే, అంబాజీపేట

కోనసీమ కొబ్బరి మార్కెట్‌లో కొబ్బరికాయలకే కాదు... ఆ కాయల నుంచి వచ్చే కొబ్బరిడొక్కకు ఇప్పుడు మార్కెట్‌లో మంచి డిమాండు వచ్చింది. ఒకప్పుడు ఈ కొబ్బరి డొక్కను వంటచెరకుగా వినియోగించుకునేందుకు పేదలకు ఊరికినే రైతులు ఇచ్చేవారు. ఇప్పుడు దీనికి కొనుగోలు చేసుకుని తీసుకెళ్లేందుకు వ్యాపారులు ఉత్సాహం చూపిస్తున్నారు. దీంతో కొబ్బరి డొక్క ధరకు రెక్కలొచ్చాయి. గతంలో ట్రాక్టర్ కొబ్బరి డొక్క రూ.1,500 నుంచి రూ.2,000 వరకు ఉండేది. ఇప్పుడు అదే ట్రాక్టర్ డొక్క రూ.3 వేలు నుంచి రూ.4 వేలు ధర పలుకుతోంది. పొరుగు రాష్ట్రాలతో పాటు కోనసీమలో కూడా కాస్త కొబ్బరికాయల ఉత్పత్తి తగ్గటం..దీనికి తోడు కొబ్బరితాడు, కొబ్బరిపొట్టులకు డిమాండు రావటం...కొబ్బరి డొక్క పెరుగుదలకు కారణమైంది. కొబ్బరి డొక్కతో తయారు చేసిన తాడును హైదరాబాద్, మహారాష్ట్ర, పశ్చిమబంగ, బంగ్లాదేశ్‌లకు ఎగుమతులు జరుగుతున్నాయి. 13 నుంచి 14 వేల కొబ్బరికాయలను ఒలిచిన తరువాత పీచుతో వచ్చే డొక్కను ఒక ట్రాక్టర్ డొక్కగా పరిగణిస్తారు. ఇటుక బట్టీల నిర్వాహకులు కొబ్బరి డొక్కను కూడా కొనుగోలు చేయడంతో దీనికి మరింత డిమాండు ఏర్పడింది. దీంతో పీచుపరిశ్రమల నిర్వాహకులు అధిక ధరకు డొక్కను కొనుగోలు చేయాల్సివస్తోందని విజయదుర్గా పీచుపరిశ్రమ నిర్వాహకుడు నెల్లి నాగరాజు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఇదిలా ఉండగా కోనసీమ కొబ్బరిమార్కెట్‌లో కురిడీ కొబ్బరికాయల ధరలు కొంచెం పెరిగాయి. వెయ్యి కురిడీ కొబ్బరికాయలు రూ.16,500 (పాతకాయగండేరా)నుంచి రూ.18,500, గటగట రకం రూ.13,500 నుంచి రూ.15,000లకు ఎగబాకాయి. కొబ్బరి పచ్చికాయలు ధర మొన్న రూ.18,000 పలికింది. అయితే బుధవారం కొబ్బరిసంతలో వెయ్యింటికీ రూ.17,000 మాత్రమే నడిచింది. కొత్త కొబ్బరి క్వింటాకు రూ.12 వేల నుంచి రూ.12,500లకు చేరింది.


గుట్టలుగా కొబ్బరి డొక్క...

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

జిల్లా క్రీడా పోటీలకు ఎంపిక



బాలికల విభాగంలో ఎంపికైన క్రీడాకారులు

మలికిపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో ఐట్లలంక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన నియోజకవర్గ స్థాయి అండర్ 14, 17 బాలుర, బాలికల విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విజేతలుగా నిలిచి జిల్లా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ.వి.శ్రీనివాస్, స్థానిక పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.నాగరాజు బుధవారం అభినందించారు. కాకినాడ జిల్లా (స్పోర్ట్స్) అథారిటీ (గ్రౌండ్)లో గురువారం నుంచి జరిగే జిల్లా పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు.

అక్రమ రొయ్యల చెరువులను తొలగించాలి



సమావేశంలో పాల్గొన్న సీపీఐ నాయకులు

రాజోలు: అక్రమంగా సాగవుతున్న రొయ్యల చెరువులను తక్షణమే తొలగించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన చింతలపల్లి, ములికిపల్లి, వేగివారిపాలెం గ్రామశాఖల సమావేశానికి జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడిచర్ల సత్యనారాయణ, పుల్లెల ఆనంద్, తాడి సత్యనారాయణ, వై. వెంకట్, ఉండ్రు శ్రీను, వంశీ, నాగేశ్వరరావు, సరస్వతి, వెంకటలక్ష్మి, శ్రీదేవి, రాజేష్, గౌరమ్మ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

నూతన రహదారి నిర్మాణం

అంతర్వేది: అంతర్వేది దేవస్థానం 16 స్తంభాల మండపం వద్ద నూతన రోడ్డు నిర్మించారు. చిన్నపాటి వర్షం కురిస్తే రోడ్డుపై ఇరువైపులా ముంపునీరు ఉంటుంది. ఈ విషయాన్ని సర్పంచి జాన్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి మురుగునీరు గొట్టాల ద్వారా బయటకు వెళ్లేటట్టు చేశారు.

బాగుపడిన పరిసరాలు

మామిడికుదురు: మండలంలోని నగరంలో పంచాయతీ కార్యాలయానికి సమీపం నుంచి ప్రధాన రహదారి ఇరుకుని పరిసరాల్లో పెరిగిన చెత్తకుప్పలను తొలగించాలని స్థానికులు చేసిన విజ్ఞప్తిపై పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సర్పంచి జాలెం రమణకుమారి, కార్యదర్శి మేనేపే ప్రసాద్ అక్కడి చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లి శుభ్రం చేయించారు.

తుప్పలు తొలగించారు

అంబాజీపేట: గంగలకుర్రుఅగ్రహారం పంచాయతీ పరిధిలోని పెదపాలెంలోని అంబాజీపేట- గంగలకుర్రు అగ్రహారం ప్రధాన రహదారికి ఇరువైపులా తుప్పలు, డొంకలు బాగా పెరిగిపోయాయి. దీనిపై ఈ నెల 3న 'తుప్పలు... డొంకలతో తిప్పలు' శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఉపాధి హామీ పథకం ఏపీవో అడపా వెంకటకృష్ణ, క్షేత్రసహాయకుడు వెన్నపు శ్రీనివాసరావు ఇక్కడ రహదారికి రెండువైపులా ఉన్న తుప్పలు, డొంకలను తొలగించి... రహదారిని శుభ్రం చేయించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

నిధులు లేక.. నీరసించిన పనులు



నాగుల్లంకలో నిలిచిన జడ్పీ ఉన్నతపాఠశాల భవనం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: 'నాడు-నేడు' పనులతో పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి... ఇక్కడి నుంచే రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశ పనులను ప్రజలకు అంకితం చేస్తున్నాం... ఇక్కడి నుంచే రెండో దశ పనులను మొదలు పెడుతున్నాం...' అంటూ 2021 ఆగస్టు 16న అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. పి.గన్నవరం జడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా ఆయన నాడు-నేడు కోసం చేసిన ప్రసంగం ఇది. రెండో దశ ప్రారంభించినా వేగంగా నిధులు విడుదల చేయకపోవడంతో నేటికీ ఈ పనులు నత్తనడకకంటే దారుణంగా తయారయ్యాయి. పి.గన్నవరం నియోజకవర్గంలో నాడు-నేడు రెండో దశకింద 126 ప్రభుత్వ పాఠశాలలు, ఆరు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు అప్పట్లో మంజూరు ఇచ్చారు. ఈ పనుల కోసం నియోజకవర్గం మొత్తం మీద రూ.52.82 కోట్లు నిధులు విడుదల కావాల్సి ఉండగా రూ.27.38కోట్లు విడుదలవ్వడంతో అంతవరకు పనులు చేసి విడిచిపెట్టారు. భవన నిర్మాణాలు నూరుశాతం పూర్తికావాలంటే రూ.25.44కోట్ల నిధులు విడుదల కావల్సి ఉంది. ప్రధానంగా ఈ పనులకు సిమెంటును కూడా గత ప్రభుత్వమే పంపిణీ చేయాల్సి ఉండగా దీనిని కూడా అరకొరగా పంపిణీ చేశారు. నాడు-నేడు పనులు నూరుశాతం పూర్తి కావాలంటే మిగిలిన నిధులు విడుదల చేయటంతోపాటు సిమెంట్‌ను సరఫరా చేయాల్సిన అవసరం ఉంది. నాగుల్లంక, మానేపల్లి, జి.పెదపూడి, ఆర్.ఏనుగుపల్లి, పుల్లేటికుర్రు, గంగలకుర్రు, విలస, నేదునూరు, కొండుకుదురు, తొత్తరమూడి తదితర గ్రామాల్లో నాడు-నేడు పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.

సిమెంట్ రావాలి

నాడు-నేడు రెండో దశ పనులకు సంబంధించి నిధుల కొరత ఉంది. నిధులు విడుదల కావాల్సి ఉంది. సిమెంట్ కూడా ప్రభుత్వం ఇవ్వాలి. ఈ రెండు కారణాలతో పనులు ముందుకు సాగటంలేదు. నిధులు, సిమెంట్ రాగానే పనులు మొదలు పెడతాం.

కె.ఆనంద్, కె.వి.కృష్ణంరాజు, వి.నాగేశ్వరరావు, ఆయా మండలాల ఇంజినీరింగ్ అధికారులు

ఫ్యూజ్ బాక్సును మార్చారు..



అంబాజీపేట: వక్కలంక గ్రామానికి వెళ్లే మలుపులో విద్యుత్తు స్తంభానికి చేతికందే ఎత్తులో ఉన్న ఫ్యూజు పెట్టెతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని 'చేతికందే ఎత్తులో ప్రమాదం' శీర్షికతో ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్తుశాఖ ఏఈ పి.కవిత స్పందించారు. ఫ్యూజు బాక్సును స్తంభానికి పైభాగంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. సర్పంచి వాసంశెట్టి రేవతి కూడా ఈ సమస్యపై విద్యుత్తుశాఖ అధికారులతో మాట్లాడారు.

ఈనాడు కథనానికి స్పందన

రోడ్డుపై రంధ్రం పూడ్చివేత



రాజోలు: శివకోటి జాతీయ రహదారి మధ్యలో గొయ్యిపడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై ఈ నెల11న 'ప్రమాదం కనిపించడం లేదా' శీర్షికన కథనం వెలువడింది. ఎన్‌హెచ్ అధికారులు స్పందించి రంధ్రాన్ని పూడ్చడంతో వాహనదారుల ఇబ్బందులు తప్పాయి.



ర్యాలిలో పారిశుద్ధ్య కార్మికులతో బండారు సత్యానందరావు



అంబాజీపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం



అంతర్వేదిలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాదరావు

ర్యాలి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం ర్యాలి గ్రామంలో జనసేన బాధ్యుడు బండారు శ్రీనివాస్‌తో కలిసి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవలో కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులతో కలిసి శుభ్రత పనులు చేసి మొక్కలు నాటారు. సర్పంచి కొడమంచిలి లక్ష్మి, నాయకులు సుబ్బారావు, భాస్కరరావు, జగన్నాథం, రామకృష్ణ, కృష్ణమూర్తి, వెంకన్న, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: రాజోలు నియోజకవర్గ తక్షణ అభివృద్ధికి రూ.350కోట్లతో ప్రణాళికను తయారు చేసి ప్రభుత్వానికి అందించానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు అంతర్వేదిలో సర్పంచి పోతురాజు కిషోర్ అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సమన్వయకర్త పెదకాపు, నియోజకవర్గ తెదేపా పరిశీలకులు రామ్మోహన్‌రావు, ముప్పర్తినాని, పోతురాజు కృష్ణ, మహాలక్ష్మి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మార్కెట్ యార్డు ఆవరణలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన జరిగింది. ప్రత్యేకాధికారి శివశంకరప్రసాద్, ఎంపీడీవో సరోవర్, తహసీల్దార్ వెంకటేశ్వరి, నాయకులు నామన రాంబాబు, వీరవెంకటసత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా దృక్పథం అలవరచుకోవాలి



బహుమతులు అందిస్తున్న ఆర్డీవో సత్యనారాయణ

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులంతా సేవా దృక్పథం అలవరుచుకుని వివిధ కార్యక్రమాలు చేపట్టాలని కొత్తపేట ఆర్డీవో సత్యనారాయణ అన్నారు. రావులపాలెంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్డీవో హాజరై మాట్లాడారు. ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు సాధించిన లింగేశ్వరరెడ్డి, ఆనందరాజు, శ్రీకాంత్, ప్రభుత్వ ఉద్యోగులు రవికుమార్, స్వర్ణలత, వెంకటరమణ, శ్రీనివాస్‌లను ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సై చంటి, ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే వ్యాధుల నియంత్రణ



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న కూటమి నాయకులు

ఆలమూరు, న్యూస్‌టుడే: సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా అనేక వ్యాధులను నియంత్రించవచ్చునని ఆలమూరు మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి అన్నారు. ఆలమూరు శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణమండపంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. అమలాపురం జిల్లా తెలుగు రైతు అధికార ప్రతినిధి ఈదల సత్తిబాబు ఆధ్వర్యంలో గ్రామంలో 25 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి నాతి లావణ్య, కూటమి నాయకులు, ఆశ, ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఫార్మాసిస్టుల దినోత్సవం



రావులపాలెంలో విద్యార్థులు, అధ్యాపకుల ప్రదర్శన

రావులపాలెం పట్టణం: రావులపాలెం లిథియా కాలేజి ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రావులపాలెంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్.మనోహర్‌బాబు ర్యాలీ ప్రారంభించారు. ఔషధాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

మామిడికుదురు: మగటపల్లిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో 30 ఏళ్లుగా సోడా బడ్డీ పెట్టుకుని జీవిస్తున్న నామన రాజనరసింహారావు కుటుంబానికి ఉపాధి లేకుండా చేసినందుకు గ్రామస్థులు పలువురు స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. మూడు నెలల క్రితం అక్కడి బడ్డీని గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారని, అదే స్థలంలో మళ్లీ కొత్తది పెట్టుకోవడానికి ప్రయత్నిస్తుండగా కొందరు వైకాపా నాయకులు అడ్డుకుంటున్నారన్నారు. ఈ విషయంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వైకాపా నాయకులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపిస్తూ ఆయనకు వ్యతిరేకంగా ప్లకార్డులతో నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రాలను అందజేశారు.

రావులపాలెం ఎంఈవోగా నాగకుమార్



రావులపాలెం పట్టణం: రావులపాలెం మండల విద్యాశాఖాధికారి-1గా ఆర్.నాగకుమార్ బుధవారం నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం మండపేట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఎంఈవో-2 శ్రీనివాస్‌రాజు, సిబ్బంది, ఇతర ఉపాధ్యాయులు నాగకుమార్‌ను అభినందించారు.

ఏఈగా ఆచార్యులు

పి.గన్నవరం: పి.గన్నవరం విద్యుత్తుశాఖ ఏఈగా జి.వి.ఆచార్యులు బుధవారం ఉద్యోగబాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఏఈ ఎస్.ఆనందరాజు అమలాపురానికి బదిలీపై వెళ్లారు. ఆచార్యులు అమలాపురం విద్యుత్తుశాఖ కార్యాలయంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడి వచ్చారు.

మిత వ్యయంతో అధిక దిగుబడులు సాధించాలి

అంబాజీపేట, న్యూస్‌టుడే: రైతులు తాము పండించే పంటలకు తక్కువ ఖర్చుతో అధిక రాబడి వచ్చేలా సాగురంగాన్ని ఎంచుకోవాలని పి.గన్నవరం ఏడీఏ రామమోహనరావు అన్నారు. మండలంలోని వక్కలంక, మొసలపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది...వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచి వాసంశెట్టి రేవతి, మార్కెట్‌కమిటీ పర్యవేక్షకుడు కుమార్, ఉద్యానశాఖాధికారి డి.వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారి విజయకుమార్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



బాలిక బంధువులకు నగదు అందిస్తున్న ఛారిటీ సభ్యులు

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: గొంది గ్రామంలో విద్యుత్తు ప్రమాదానికి గురైన బాలిక బర్రె దుర్గాభవానికి కువైట్ కేంద్రంగా పని చేస్తున్న జీసస్ హోప్ ఛారిటీ సభ్యులు రూ.50వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రవికుమార్, ఎంఈవో కిషోర్‌కుమార్, మండల యూటీఎఫ్ అధ్యక్షులు రాజబాబు, కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: అనారోగ్యంతో బాధపడుతున్న కడలికి చెందిన వడ్డి ఆయుష్ రాజు వైద్య ఖర్చుల నిమిత్తం కడలి కాంప్లెక్స్ ఉపాధ్యాయులు సమకూర్చిన రూ.25,711 విరాళాన్ని బాలుడి కుటుంబ సభ్యులకు సర్పంచి చొప్పల గుణనాథ్ బుధవారం అందజేశారు. ఉపాధ్యాయులు ఆచార్యులు, రాచయ్య, దుర్గాప్రసాద్, బాబు, సత్యనారాయణ, బాలాజీ, కిరణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శంకర్రావు సేవలు చిరస్మరణీయం

మామిడికుదురు, న్యూస్‌టుడే: గ్రామానికి చెందిన తెదేపా మండల సాంస్కృతిక విభాగం కార్యదర్శి వాసంశెట్టి శంకర్రావు పార్టీ నాయకుడుగా, కళాకారుడుగా చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమేనని పలువురు పేర్కొన్నారు. ఆయన సంస్మరణ కార్యక్రమం సందర్భంగా కోనసీమ వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మామిడికుదురులోని ఆయన స్వగృహం వద్ద బుధవారం జరిగిన సంతాప సభలో మాట్లాడారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

మసీదుసెంటర్ (కాకినాడ): మలికిపురం మండలం కత్తిమండకు చెందిన కె.రత్నకుమారి(58) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందారు. ప్రమాదవశాత్తూ వేడినీళ్లు మీద పడి కాలినగాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం ఈ నెల 21న జీజీహెచ్‌లో చేర్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మామిడికుదురు, న్యూస్‌టుడే: మండలంలోని బి.దొడ్డవరంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పెదపట్నంలంకకు చెందిన తండ్రీకొడుకులు గాయపడ్డారు. వీరు అమలాపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కటికిరెడ్డి ప్రసాద్ తన కుమారుడు సాయిని కళాశాల బస్సు ఎక్కించేందుకు ద్విచక్ర వాహనంపై అప్పనపల్లి తీసుకెళ్తుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.

కాలనీకి వెళ్లాలంటే తాటిపట్టెలే శరణ్యం



మామిడికుదురు మండలం మొగలికుదురులోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న 60 కుటుంబాల వారికి అక్కడి కాలువ దాటి వెళ్లడం ఇబ్బందికరంగా మారింది. దానిపై తాటిపట్టెలు ఏర్పాటు చేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు భయపడుతున్నారు. ఇక్కడ కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టాలని విన్నపాలు చేస్తున్నారు. అక్కడి ఇళ్ల వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు పరివర్తకాన్ని దూరంగా వేయాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లగా తాను అక్కడి సమస్యలను పరిశీలించినట్లు చెప్పారు.

-న్యూస్‌టుడే, మామిడికుదురు

తాగునీరు వృథా..



అంబాజీపేట మండలంలోని పసుపల్లి పంచాయతీ సమీపంలోని మలుపు వద్ద ఉన్న తాగునీరు కొళాయి ఇది. దీనికి ట్యాపు సరిగాలేక పోవడంతో తాగునీరు వృథాగా బయటకుపోతుంది. స్థానికులు ఈ నీటి వృథాను అరికట్టేందుకు ఇక్కడి కొళాయి ట్యాపునకు ఓ కర్రపుల్లను ఉంచారు. అయినప్పటికీ తాగునీరు వృథా తప్పడం లేదు. దీనిపై పంచాయతీ కార్యదర్శి గణేష్‌ను వివరణ కోరగా పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, అంబాజీపేట

ముంచెత్తిన వాన



అయినవిల్లిలో కాలనీ జలమయం

అయినవిల్లి, న్యూస్‌టుడే: మండలంలో బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి తొత్తరమూడి బాలయోగి కాలనీ, అయినవిల్లి పేదపేట, న్యూకాలనీ, నేదునూరు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు రహదారులు నీటమునిగాయి. నేదునూరులో కుమ్మరి కాలువ పొంగి ప్రవహించడంతో పరిసరప్రాంతాల్లోని వరిచేలు ముంపుబారిన పడ్డాయి. చిరుపొట్టదశలో ఉన్న కారణంగా దిగుబడులపై ప్రభావం ఉంటుందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

మామిడికుదురు: అల్పపీడన ప్రభావంతో బుధవారం కురిసిన భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. పాశర్లపూడి, మామిడికుదురు, నగరంలోని 216 జాతీయ రహదారిపై మూడు చోట్ల 600 మీటర్ల మేర వర్షం నీరు నిలిచిపోవడంతో యాతనలు ఎదురయ్యాయి. నీరు బయటకు వెళ్లే మార్గం కరవై ఈ దుస్థితి నెలకొంది. గెద్దాడ, లూటుకుర్రు, పెదపట్నం, ఆదుర్రు, మోరిపోలం, బి.దొడ్డవరం గ్రామాల్లో రహదారుల గుంతల్లో వర్షం నీరు నిలిచిపోయి స్థానికులు సతమతమయ్యారు. పాశర్లపూడి నుంచి పెదపట్నం వరకు ఏటిగట్టు బురదమయంగా మారడంతో లంక గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

ఏబీ స్విచ్ ఏర్పాటు చేయాలి

మలికిపురం, న్యూస్‌టుడే: లక్కవరం గూడపల్లి నెంబర్ 1 కాలువ వద్ద ఉన్న ఏబీ స్విచ్ కాలిపోయి నాలుగు నెలలైనా ఇప్పటి వరకు దీన్ని సరిచేయకపోవడం వల్ల తరచూ విద్యుత్తు సమస్యలు ఏర్పడి ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణరాజు బుధవారం అన్నారు. ఇదే గ్రామంలోని పశువుల ఆసుపత్రి వద్ద ఉన్న 40 కె.వి. సామర్థ్యం ఉన్న విద్యుత్తు నియంత్రిక కాలిపోయి ఈ ప్రాంత విద్యుత్తు వినియోగదారులు లో వోల్టేజి సమస్యతో సతమతమవుతున్నారన్నారు. ఏబీ స్విచ్‌ను పునరుద్ధరించాలని, పశువుల ఆసుపత్రి వద్ద కాలిపోయిన నియంత్రిక స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి మెరుగైన విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకోవాలని గోపాలకృష్ణరాజు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.



నరసింహారావును సన్మానిస్తున్న కూటమి నాయకులు

నరసింహారావుకు అభినందనలు

మలికిపురం, న్యూస్‌టుడే: మార్క్‌ఫెడ్ రాష్ట్ర సభ్యుడిగా నియమితులైన జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గుండుబోగుల నరసింహారావు(పెద్దకాపు)ను పలువురు కూటమి నాయకులు బుధవారం అభినందించారు. పెద్దకాపు నివాసం వద్ద పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ పటిష్టతకు కృషి చేసిన పెద్దకాపునకు తగిన గుర్తింపు లభించిందని నాయకులు అంటూ వారు పెద్దకాపు సేవలను ప్రశంసించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపట్టిన వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి అమలాపురానికి చెందిన కొర్రప్రోలు నాగ సూర్యకాంతం బుధవారం రూ.1,00,116 విరాళం అందించారు. వీరికి దేవస్థానం డీసీ చక్రధరరావు స్వామివారి చిత్రపటం బహూకరించి అభినందించారు.

నెయ్యి కల్తీకి కారకులపై చర్యలు తీసుకోవాలి



దీక్ష చేస్తున్న వారికి సంఘీభావం తెలుపుతున్న కార్పొరేషన్ల డైరెక్టర్లు

మామిడికుదురు, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదానికి వినియోగించిన నెయ్యి కల్తీకి కారకులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ కడలి ఈశ్వరి, పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ గంటా స్వరూపాదేవి తెలిపారు. లడ్డూ ప్రసాదం అపవిత్రం చేసినందుకు అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానంలో ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన వారిని బుధవారం కలిసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో దీక్ష చేపట్టిన కంకిపాటి నరసింహారావు, తుండూరి బుజ్జి, బళ్ల సతీష్, జవ్వాది నానితో పాటు నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, జనసేన మండల అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా తదితరులు పాల్గొన్నారు.

విజన్ 2047పై అవగాహన సదస్సు

కొత్తపేట, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడు చేపట్టిన స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కొత్తపేట తహసీల్దార్ రాంబాబు పిలుపునిచ్చారు. బుధవారం కొత్తపేట శతాబ్ది కళాశాలలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. 2047 నాటికి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు తదితర అంశాలపై యుఆర్‌ఎల్ లింక్ ద్వారా తమ అభిప్రాయాలు తెలపాలన్నారు.

● విశ్వకవి వేమన డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ కె.పి.రాజు అధ్యక్షతన విజన్ 2047 కార్యక్రమం నిర్వహించారు. అంకమరావు, సత్యనారాయణ, కట్టా నాగమోహన్, దుర్గాభవాని, ఆర్.ఐ.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

చర్చించండి.. పరిష్కరించండి

• నేడు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం



గొందిలో నిరుపయోగంగా తాగునీటి ట్యాంకు

సఖినేటిపల్లి,న్యూస్‌టుడే: మండలంలో ప్రతి మూడు నెలలకు ఒక సారి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నారు. దీంట్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పనులపై చర్చించి పరిష్కారం చూపాలి. గత అయిదేళ్లు వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉంది. అలాగే మండలంలోనూ వైకాపా 15స్థానాలతో ఎంపీపీ స్థానం దక్కించుకుంది. చర్చించిన సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. నేడు జరిగే సమావేశంలోనైనా సమస్యలకు పరిష్కారం దొరికేనా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ఇవిగో సమస్యలు

● గుడిమూల-అంతర్వేదిపాలెం, అంతర్వేదిదండుపుంత, శృంగవరప్పాడు తదితర గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా తయారై ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారాయి. ● అంతర్వేదికర, కేశవదాసుపాలెం, అంతర్వేదిపాలెం తదితర గ్రామాల్లో మురుగు కాలువలు సక్రమంగా లేక కాలనీలు ముంపునకు గురై ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ● మండలంలో తాగునీటి సమస్య విపరీతంగా వేధిస్తోంది. గొందిలో జల్‌జీవన్ మిషన్‌లో నిర్మించిన ట్యాంకులు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ● లోవోల్టేజీ విద్యుత్తు సమస్యతో గృహాల్లోని విద్యుత్తు పరికరాలు కాలిపోతున్నాయి. ● సఖినేటిపల్లి-నరసాపురం రేవులో లగేజీకి అధికమొత్తంలో రుసుము వసూలు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడు కరవయ్యారు. ● మండలంలోని నాడు-నేడులో నిర్మించిన పాఠశాల భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ● సఖినేటిపల్లిలో పీహెచ్‌సీ భవనం అసంపూర్తిగా ఉంది. ఇలా అనేక సమస్యలు మండలంలో ఉన్నాయి. ప్రతి ప్రజాప్రతినిధి నోరు విప్పి సమస్యల విన్నవించాలని.. ఆదిశగా పరిష్కారానికి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

అమలాపురం
• అమలాపురం • ముమ్మిడివరం

విద్యుత్తు శాఖ ఏఈగా ఏసురాజు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం విద్యుత్తు శాఖ ఏఈగా ఎస్.ఏసురాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన శివాజీ భీమడోలుకు బదిలీకాగా.. ద్రాక్షారామ సెక్షన్‌లో ఏఈగా పనిచేస్తున్న ఏసురాజు ముమ్మిడివరం బదిలీపై వచ్చారు. కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపట్టిన వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి అమలాపురానికి చెందిన కొరుప్రోలు నాగ సూర్య కాంతం బుధవారం రూ.1,00,116 విరాళం అందించారు. వీరికి దేవస్థానం డీసీ చక్రధరరావు స్వామివారి చిత్రపటం బహూకరించి అభినందించారు.

టింబర్ డిపోల్లో సామగ్రి విక్రయాలు తగదు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: టింబర్ డిపోల్లో రెడీమేడ్ కిటికీలు, గుమ్మాలు, తలుపుల విక్రయాలు తగదని, ఆ విధంగా విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని వర్కర్స్ ఆఫ్ కోనసీమ అధ్యక్షుడు దేవదుల సూర్యనారాయణమూర్తి కోరారు. ఈ మేరకు చేతివృత్తిదారులతో కలిసి అమలాపురంలోని ఆదివిశాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ జగితా బేగంకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతివృత్తిదారులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పితాని బేబీరావు, గున్నేపల్లి భీమశంకరం, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించరూ..!

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం మండలం జనుపల్లి న్యూ కాలనీకి రహదారి సదుపాయం కల్పించాలని స్థానిక మహిళలు ఎమ్మెల్యే ఆనందరావును కోరారు. అమలాపురంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ తెదేపా కార్యాలయంలో ఆయనను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. తమ కాలనీకి రోడ్డులేక ఎన్నో అవస్థలు పడుతున్నామని, గత వైకాపా పాలనలో నిర్లక్ష్యం చూపారని మొరపెట్టుకున్నారు. దానిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని చెప్పారని లావణ్య, లక్ష్మి, కుమారి, మోహన్‌బాబు తదితరులు తెలిపారు.


ఎమ్మెల్యే ఆనందరావుకు వినతిపత్రం అందిస్తున్న మహిళలు

పుదుచ్చేరి సీఎం ఉన్నతస్థాయి సమావేశం

యానాం, న్యూస్‌టుడే: యానాంలో రిక్రియేషన్ పేరుతో జరుగుతున్న పేకాట క్లబ్‌లపై పుదుచ్చేరి సీఎం రంగసామి నేతృత్వంలో బుధవారం ఉన్నత స్థాయి సమావేశం జరిగినట్లు ఆ ప్రభుత్వ దిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. పుదుచ్చేరి ప్రభుత్వ లా సెక్రెటరి, డీజీపీ, కలెక్టర్, ఐజీ, ఎస్పీలతో ముఖ్యమంత్రి రంగసామి నిర్వహించిన సమావేశంలో మల్లాడి కృష్ణారావు హాజరయ్యారు. కోర్టులను అడ్డం పెట్టుకుని క్లబ్ నిర్వాహకులు ముందుకు వెళ్తుంటే.. సంబంధిత అంశాలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని మల్లాడి సూచించారు. క్లబ్‌ల నిర్వహణ విషయంలో కొంతమంది పోలీసుల పాత్రపై సమావేశంలో చర్చకు వచ్చిందన్నారు. ఈ అంశాలపై పుదుచ్చేరి నుంచి పర్యవేక్షణ ఉంటుందని పోలీసు ఉన్నతాధికారులు సమావేశంలో వివరించారని కృష్ణారావు తెలిపారు.

అనుమతులుండవు.. నిబంధనలు పట్టవు

తీరం వెంబడి ఇష్టారాజ్యంగా రొయ్యల చెరువులు


కొమరగిరిపట్నం: డి-పట్టా భూముల్లో సాగవుతున్న చెరువులు

న్యూస్‌టుడే, అల్లవరం

అనుమతులతో సంబంధం లేకుండా అనధికారికంగా వందల ఎకరాల రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారు. ఓడలరేవు, కొమరగిరిపట్నం, ఎస్.యానాం తదితర ప్రాంతాల్లోని సముద్ర తీరానికి కొంత మేర దూరంలోనే ఉన్నా వీటి వంక అధికారులు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇవన్నీ సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా సాగవుతున్నవే. దీంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతోపాటు సముద్ర ప్రవాహ గమనంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

వివరాలు ఇలా (ఎకరాల్లో)..

నియోజకవర్గం	ఆక్వా జోన్	నాన్ ఆక్వా జోన్
ముమ్మిడివరం	8,928	4,678
అమలాపురం	12,949	7,608

ఇరవై నాలుగు గంటలూ విద్యుత్తు..

రొయ్యల చెరువులకు విద్యుత్తు కనెక్షన్ ఇవ్వాలంటే ప్రధానంగా రెవెన్యూ, మత్స్య, వ్యవసాయ, డ్రైనేజ్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ధ్రువీకరణ పత్రాలు ఇస్తే వాటి ఆధారంగా ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్తు నియంత్రికను మంజూరు చేసి కనెక్షన్ ఇస్తారు. ఇక్కడ సముద్ర తీరంలో సాగవుతున్న చెరువులకు ఏ ఒక్క శాఖ నుంచి అనుమతి లేక పోయినా విద్యుత్తు సౌకర్యం మాత్రం పూర్తి స్థాయిలో ఉంది. గృహాలకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నారు గాని అనధికారిక చెరువులకు మాత్రం 24 గంటలూ నిరంతరంగా విద్యుత్తు సరఫరా ఇస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ కనెక్షన్ల వెనుక వేలాది రూపాయలు చేతులు మారుతున్నాయని అందుకే నిబంధనలకు విరుద్ధంగా సాగు అవుతున్నా వీరికి అన్ని రకాల వసతులు అందుతున్నాయని సాధారణ రైతులు వాపోతున్నారు.

సర్వే నంబరు ఒక చోట..

అల్లవరం మండలం గోడి నుంచి రెబ్బనపల్లి వరకు గోదావరి తీరంలో అనధికారికంగా రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారు. వీటిలో చాలా చెరువులకు ఇతర ప్రాంతాల్లో ఉన్న భూముల సర్వే నంబర్లపై తప్పుడు ధ్రువ పత్రాలు తీసుకుని విద్యుత్తు కనెక్షన్లు పొందారు. ఈ తంతు ట్రాన్స్‌కో అధికారులకు తెలిసినా మామూళ్ల మత్తులో నిబంధనలు తుంగలో తొక్కి దొడ్డి దారిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆక్వాజోన్‌లో ఉండి ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు ఉన్న వారికి కనెక్షన్ ఇచ్చేందుకు రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి సర్వే నిర్వహించి, అనధికారిక రొయ్యల చెరువులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


ఓడలరేవు తీరంలో అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

అమలాపురం డివిజన్ వ్యాప్తంగా తీరంలో అనధికారికంగా సాగవుతున్న రొయ్యల చెరువులకు ఉన్న విద్యుత్తు కనెక్షన్లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిపై చర్యలు తీసుకుంటాం.

– రవికుమార్, ట్రాన్స్‌కో ఈఈ, అమలాపురం

బహుళ వైకల్య వ్యక్తులను గుర్తించాలి

యానాం, న్యూస్‌టుడే: బహుళ వైకల్య వ్యక్తుల గుర్తింపులో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన పెంచుకోవాలని మల్టీ డిజేబుల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ నాయుడు సూచించారు. యానాం బీచ్ రోడ్డులోని ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బహుళ వైకల్యం కలిగిన చిన్నారులకు ఇంటి వద్దే ఫిజియోథెరపీ, బలవర్ధక ఆహారం అందిస్తామన్నారు. దివ్యాంగులకు రక్షణగా ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. సీనియర్ ఫ్యాకల్టీ రంజీ అంబేడ్కర్, స్వాతి, సంపత్, గీత, విజయదుర్గ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన కార్మిక సంఘం నేతలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజును మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బుధవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీఐ జిల్లా కన్వీనర్ కె.సత్తిబాబు, ఏఐటీయూసీ నాయకులు కొప్పుల కృష్ణ, మల్లారపు సత్యనారాయణ పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.



దారంతా గుంతలు.. వాహనదారుల అవస్థలు

అమలాపురం మండలం సవరప్పాలెం నుంచి ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం వరకుగల రహదారి గుంతలమయంగా మారింది. దీంతో పది గ్రామాల ప్రజలకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. ఓ మోస్తరు వర్షాలకే గుంతల్లో నీరు చేరడంతో ద్విచక్రవాహన చోదకులు అదుపు తప్పి పడిపోతున్నారు. అధికారులు దృష్టి సారించి రహదారిని పునర్నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ర.భ.శాఖ ఏఈని అడుగగా గతంలో ప్రతిపాదనలు పంపించామన్నారు.



\- న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

ఈ మార్గంలో ప్రయాణమెలా..?

ముమ్మిడివరం మండలంలోని కొండాలమ్మచింత-ముక్తేశ్వరం ర.భ.శాఖ రహదారి గుంతలమయం కావడంతో ప్రయాణికులు నానాపాట్లు పడుతున్నారు. రహదారి అడుగుకో అతుకు.. గజానికో గతుకు చందంగా మారడంతో వాహనదారులు పడుతున్న యాతన అంతా ఇంతా కాదు. రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో 10 కిలో మీటర్లు పైగా దూరాభారమైనా ఇతర అంతర్గత రహదారుల్లో ప్రయాణించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ పరిస్థితిపై సంబంధిత ఏఈ సురేష్ వద్ద ప్రస్తావించగా.. గుంతలమయంగా మారిన రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందని.. వీటికి అంచనాలు రూపొందించి ప్రతిపాదించామన్నారు. త్వరలో మరమ్మతులు చేపడతామన్నారు.



\- న్యూస్‌టుడే, ముమ్మిడివరం

లోతట్టు ప్రాంతాలు జలమయం



కాట్రేనికోన, న్యూస్‌టుడే: మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. బుధవారం తెల్లవారుజామున ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో చెంచులగరువు, కాట్రేనికోన, ఆంధ్రాబ్యాంకు వీధి, పోలీసుస్టేషను కూడలి, బ్రహ్మన్నచెరువు, గెద్దనపల్లి, కందికుప్ప, మొండిపోర, వేట్లపాలెం తదితర చోట్ల రోడ్లపై గుంతల్లో నీరు చేరింది. రామస్వామితోట, కందికుప్ప, దొంతికుర్రు పాఠశాలల ఆవరణల్లోనూ నీరు నిలిచింది. దీంతో ప్రజలు, విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

సమస్య: అమలాపురం ఎత్తురోడ్డు శ్మశానవాటికకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో అటుగా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడ పిచ్చిమొక్కలను తొలగించేలా చర్యలు తీసుకోవాలి. – పి.ప్రకాష్, స్థానికుడు

సమస్య: అమలాపురం మొబర్లీపేటలో చెట్లకొమ్మలను నరికి రోడ్డుపై అలాగే వదిలివేశారు. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. – సూరిబాబు, స్థానికుడు

సమస్య: అమలాపురం విద్యుత్‌నగర్‌లో మురుగు కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. విపరీతమైన దుర్వాసన వస్తోంది. – కె.బాబ్జి, విద్యుత్‌నగర్

పరిష్కారం: స్థానిక ఎత్తురోడ్డు, మొబర్లీపేట, విద్యుత్‌నగర్‌లలో సమస్యలు తెలుపుగా సచివాలయ కార్యదర్శులు స్పందించారు. మున్సిపల్ సిబ్బందిచే వాటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

\- న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

పైపులైనుకు మరమ్మతులు

సమస్య: కందికుప్ప పరిధిలో తాగునీటి పైపులైను పగిలి నీరు లీకవుతుంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. – స్థానికులు

పరిష్కారం: సమస్యను సర్పంచి వెంకటలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. తమ సిబ్బందితో పగిలిన పైపులైనుకు మరమ్మతులు చేయించారు.

వీధి దీపాలకు..

సమస్య: నడవపల్లి పంచాయతీ పరిసరాల్లో కొన్నిచోట్ల వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. పంచాయతీ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. – గ్రామస్థులు

పరిష్కారం: ఈ సమస్యను పంచాయతీ సర్పంచి పల్లవికి తెలుపగా స్పందించారు. సిబ్బందితో వీధిదీపాలకు మరమ్మతులు చేయించారు.

\- న్యూస్‌టుడే, కాట్రేనికోన

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: **79811 19595**, ముమ్మిడివరం: **80085 74166**

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

అల్లవరం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగుతోందని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. బుధవారం గుండెపూడిలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు మొదటగా ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలు దిశగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇప్పటికే పలు సంక్షేమ పథకాలను అమలు చేయడం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇస్తున్న చేయూతను ప్రజలు అందిపుచ్చుకుని ఆర్థిక పురోభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో దెందుకూరి సత్తిబాబురాజు, బొర్రా ఈశ్వరరావు, సర్పంచి కృష్ణంరాజు, శ్రీనివాస్, బాబి తదితరులు పాల్గొన్నారు.


రాణేలంక కార్యక్రమంలో నాయకులు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లిలో కూటమి నాయకులు బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి గోడలపై స్టిక్కర్లు అంటించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు అరిగెల నానాజీ, నాయకులు చీకట్ల ఏసుబాబు, నల్లా సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: మండలంలో కందికుప్ప, పెనుమల్ల, బంటుమిల్లి, గచ్చకాయలపోర, సత్తెమ్మచెట్టు, పల్లంకుర్రు, నడవపల్లి, చిర్రయానం తదితర గ్రామాల్లో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, అధికారులు ఇంటింటికీ తిరిగి 100 రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన పనులను వివరించి కరపత్రాలు అందించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మిడివరం: కూటమి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి అన్నారు. ముమ్మిడివరం మండలం రాణేలంక, గోదశివారిపాలెంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కూటమి నాయకులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి బుధవారం ఇంటింటా ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 100 రోజుల్లో సంక్షేమ పథకాల అమలుకు బాటలు వేసిందన్నారు. గొలకోటి దొరబాబు, అర్ధాని శ్రీనివాసరావు, నడింపల్లి శ్రీనివాసరాజు, పిల్లి నాగరాజు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


గొల్లవిల్లిలో కూటమి నాయకుల ప్రచారం

'రఘురామ, నానాజీలను అరెస్టు చేయాలి'

కాట్రేనికోన: పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీ తొలగించి అవమానపరిచిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాట్రేనికోనలో మాలమహానాడు ఆధ్వర్యంలో నాయకులు బుధవారం నిరసన తెలిపారు. రంగరాయ మెడికల్ కళాశాలలో దళిత డాక్టర్‌పై దాడి చేసిన కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీపై కూడా చట్టపరమైన చర్యలు చేపట్టి అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. కాట్రేనికోన పోలీసుస్టేషనులో ఇరువురు ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేశారు. గెల్లా రాజేంద్ర, వడ్డి శ్యామ్, వి.శరత్, ఎ.శ్రీనుబాబు, చిన్నారావు, వినోద్, పండుబాబు, ప్రసాద్, ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదు ఇస్తున్న ఎస్సీ నాయకులు

చెకుముకి సైన్స్ పరీక్ష

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మునిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం చెకుముకి పోటీ పరీక్షలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు, సైన్స్ ఉపాధ్యాయినిలు గౌరీదేవి, కనదుర్గ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు మునిపల్లి విద్యార్థినులు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: గొల్లవిల్లిలో మంగళవారం జరిగిన నియోజకవర్గస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు వాలీబాల్‌లో మునిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు బి.పావని, బి.లావణ్య ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు తెలిపారు. వారిని తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ కిరణ్, సర్పంచి రామచంద్రరావు, పీడీ సీతాపతి, ఉపాధ్యాయులు అభినందించారు.

మద్యం స్వాధీనం

కాట్రేనికోన, న్యూస్‌టుడే: కందికుప్ప పెట్రోలు బంకు సమీపంలోని తుప్పల్లో గుర్తుతెలియని వ్యక్తులు దాచిన మద్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్సై అవినాష్ తెలిపారు. ఒక సంచిలో 100 సీసాల మద్యం ఉండటాన్ని గమనించిన పశువుల కాపరులు పోలీసులకు సమాచారమివ్వడంతో మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై విచారణ చేపట్టామన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌కు సన్మానం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసి బదిలీపై వెళ్తున్న ఆర్.రాంబాబుకు బుధవారం సిబ్బంది సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాంబాబు సేవలను గుర్తు చేసుకుని శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆజాద్ ఫౌండేషన్ సభ్యులు రూ.50 వేల చెక్కును బుధవారం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు అందజేశారు. తమ సభ్యులు కొంత మంది నేరుగా విజయవాడ వెళ్లి బాధితులకు సహాయ సహకారాలు అందించినట్లు వారు కలెక్టర్‌కు తెలియజేయగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు యల్లమిల్లి నాగసుధ కొండ, గోపాలకృష్ణ, కాశీవిశ్వనాథ్, నారాయణమూర్తి, బాబి, పట్టాభిరామయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారులను కలిసిన మల్లాడి

యానాం, న్యూస్‌టుడే: యానాం విద్యాశాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు అంశాలపై పుదుచ్చేరి విద్యాశాఖ కార్యదర్శి జవహర్, డైరెక్టర్ ప్రియదర్శినితో పుదుచ్చేరి ప్రభుత్వ దిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు బుధవారం చర్చించారు. ఉపాధ్యాయుల వినతి మేరకు వచ్చే నెల పదో తేదీ నుంచి దసరా సెలవులు ఇవ్వాలని.. పదో తేదీన జరగాల్సిన క్వార్టర్లీ పరీక్షను సెలవుల అనంతరం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరియాంపేటలో కేంద్ర ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలకు సంబంధించి నిధులు విడుదల చేయాలని కోరినట్లు కృష్ణారావు తెలిపారు.


విద్యాశాఖ కార్యదర్శితో చర్చిస్తున్న మల్లాడి

శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

అమలాపురం పట్టణం: అమలాపురం రావులచెరువు ప్రాంతంలో పేలుడు ఘటనలో మృతి చెందిన మహిళ కుటుంబం, గాయపడిన వారికి శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ నాయకులు బుధవారం ఆర్థిక సాయం అందించారు. మృతురాలు గొవ్వాల నాగలక్ష్మి కుటుంబానికి రూ.1,30,000, మిగిలిన ఆరుగురికి రూ.10 వేలు చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో చెల్లుబోయిన శ్రీనివాసరావు, మట్టపర్తి మీరాసాహెబ్, గొవ్వాల రాజేష్, సంసాని నాని, కుడుపూడి భరత్, మట్టపర్తి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


నగదు అందిస్తున్న శెట్టిబలిజ సంఘ నాయకులు

తండ్రి అదృశ్యమంటూ ఫిర్యాదు

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఐ.పోలవరం మండలం పశువుల్లంక గ్రామానికి చెందిన తన తండ్రి పులిదిండి బాబూరావు మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని కుమారుడు రవికిరణ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాబూరావుకు జ్ఞాపకశక్తి లోపించిన కారణంగా ఎక్కడికైనా వెళ్లవచ్చని రవి అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి బాబూరావు ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎస్సై భానుప్రసాద్ తెలిపారు.

మృతదేహం బంధువులకు అప్పగింత

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన మోర్త సాయిరాంకుమార్(42) మృతదేహానికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బుధవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఐ.పోలవరం మండలం పశువుల్లంక శివారు అంబటివారిపాలేనికి చెందిన సాయి ఐదేళ్లుగా లైన్‌మెన్ వద్ద సహాయకుడిగా పనిచేస్తూ.. మంగళవారం విద్యుత్తు స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా మృత్యువాత పడ్డాడు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు.

రైతులు రాయితీలను వినియోగించుకోవాలి

కాట్రేనికోన, న్యూస్‌టుడే: మండలంలోని కాట్రేనికోన, ఉప్పూడి, కుండలేశ్వరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట పొలాలను పరిశీలించి ప్రస్తుతం వరిలో వ్యాపించే సుడిదోమ, బాక్టీరియా, ఎండు తెగులు వంటివాటిపై రైతులకు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. 50 శాతం రాయితీతో పశువుల దాణా ఇస్తున్నారని రైతులు దీనిని వినియోగించుకోవాలన్నారు. ఏవో ప్రవీణ్. మత్స్యశాఖ, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: సాగులో రైతులు నూతన యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. మండలంలోని సీహెచ్ గున్నేపల్లి, అయినాపురం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమ సభల్లో ఆయన మాట్లాడారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.


కుండలేశ్వరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలో బుధవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగులో అనుసరించాల్సిన ఆధునిక సాంకేతిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, వాటి పరిధిలో ఉన్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రొక్కాల విజయలక్ష్మి, ఏవో సత్యనారాయణ, పశువైద్యాధికారి నారాయణ, ముత్యాల బాబి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తీరమే ఆవాసం.. అలలపై పోరాటం

పొట్టకూటి కోసం మత్స్యకారులు సాగర అలలపై నిత్యం పోరాటం చేయాల్సిందే. బతుకుదెరువుకు తీరంలో ఆవాసం ఉండి సాగరంలో సుదూర ప్రయాణం చేయాలి. అలలపై పడవ విన్యాసాలు చేస్తూ కడలిలోకి వేటకు వెళ్లాల్సిందే. మత్స్య సంపద చిక్కితే ఆనందం, లేకపోతే ఆ రోజు నిరాశే. విశాఖ జిల్లా నక్కపల్లి నుంచి వచ్చి చల్లపల్లి పంచాయతీ పరిధిలోని వాసాలతిప్ప తీర ప్రాంతాల్లో ఉండే వలస జాలర్ల జీవన చిత్రమిది. రోజూ వారు చేస్తున్న జీవన పోరాటానికి అద్దం పడుతున్నాయి ఈ చిత్రాలు.

\- న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం





మండపేట

• మండపేట • రామచంద్రపురం

అన్నసమారాధన

రాయవరం, న్యూస్‌టుడే: గణపతి నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా పసలపూడిలోని గోపడితోటలో శ్రీరామ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. సుమారు రెండు వేల మంది అన్నప్రసాదం స్వీకరించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

బాలలకు వాహనాలు ఇవ్వొద్దు

కాజులూరు: మైనర్లకు వాహనాలు ఇస్తే వాటిని సీజ్ చేసుకుంటామని గొల్లపాలెం ఎస్సై ఎస్.తులసీరామ్ హెచ్చరించారు. బుధవారం గొల్లపాలెంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. లైసెన్సులు లేని వారికి వాహనాలు ఇవ్వొద్దన్నారు. బాలలకు వాహనాలు ఇచ్చిన యజమానులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మైనర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం వల్ల కొందరు ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు.

పాడి రైతులకు నష్టపరిహారం చెక్కుల పంపిణీ

పామర్రు, న్యూస్‌టుడే: ఇటీవల గోదావరి వరదలకు కె.గంగవరం మండలం కోట గ్రామంలో నలుగురు రైతులు 34 గొర్రెలు, 2 గేదెలను కోల్పోయారు. బుధవారం కుందూరులో జరిగిన సభలో మంత్రి వాసంశెట్టి సుభాష్ వీరికి మొత్తం రూ.2 లక్షలు నష్టపరిహారంగా చెక్కుల రూపంలో అందజేశారు. తమ హయాంలో కోటిపల్లి-ముక్తేశ్వరం వంతెన నిర్మిస్తామన్నారు. కుందూరులో శిథిలావస్థలో ఉన్న శివాలయాన్ని పునర్నిర్మించేందుకు నిధులిస్తామన్నారు. జిల్లా పశుసంవర్ధక అధికారి వెంకట్రావు, ఏడీ ఐ.రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

పవన్ దీక్షకు సంఘీభావంగా కాగడాల ర్యాలీ

అంగర, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని, తిరుమల పవిత్రతను కాపాడాలని కోరుతూ కపిలేశ్వరపురం మండలం అంగరలో హిందూ ధర్మ సేన ఆధ్వర్యంలో కాగడాల ర్యాలీ బుధవారం నిర్వహించారు. గోవింద నామస్మరణ చేస్తూ స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు పాదయాత్ర చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావం తెలిపారు. తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని మండిపడ్డారు. దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పిల్లా బసవరాజు, చీకట్ల గంగరాజు, తోరాటి నారాయణస్వామి, కొంపెల్ల రాంబాబు శర్మ, దానేటి శరత్, అడపా బలరాం, తదితరులు పాల్గొన్నారు.



అంగరలో ర్యాలీ

ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు సత్కారం

పామర్రు: ఇటీవల పంచాయతీరాజ్ జిల్లా అధికారుల నుంచి సేవా పురస్కారం అందుకున్న కె.గంగవరం మండలం అముజూరు సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ మణికంఠను గ్రామస్థులు, సహచర సిబ్బంది బుధవారం సత్కరించారు.

అంగన్‌వాడీ ఆయాల నియామకానికి దరఖాస్తులు

కాజులూరు, న్యూస్‌టుడే: మండలంలో పెనుమళ్ల, ఆర్యవటం, పల్లిపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకురాలి నియామకానికి దరఖాస్తులు కోరుతున్నాట్లు తాళ్లరేవు ఐసీడీఎస్ సీడీపీవో వి.మాధవి తెలిపారు. ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకోవాలని కోరారు. దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువపత్రాల నకళ్లు జతచేసి అక్టోబర్ 5న సాయంత్రం అయిదు గంటలలోపు తమ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పాలతోడులో వృద్ధులకు 'విజన్ సేవా ట్రస్ట్' ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఛైర్మన్ పిల్లా సత్యమంజరి, డైరెక్టర్ పిల్లా వీరవెంకటరమేష్, పిల్లా శ్రీనివాస్, దొడ్డా రాంబాబు, బి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 గం. నుంచి మ. ఒంటి గంట మధ్య

మండపేట: 80085 74183, రామచంద్రపురం: 80085 74191

గుంతల దారిలో ఇబ్బందులు

సమస్య: ఏడిద-దుళ్ల రహదారిపై గుంతల కారణంగా వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - కార్తీక్‌చౌదరి, ఏడిద

సమాధానం: రహదారి పనులకు ప్రతిపాదనలు చేశాం. పనులు ప్రారంభిస్తాం.

- సూర్యనారాయణ, డీఈ, ర.భ శాఖ, రామచంద్రపురం సెక్షన్

వీధి దీపాలు వెలగడం లేదు

సమస్య: వెలగతోడులోని బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగక రాత్రి వేళల్లో ఇబ్బంది పడుతున్నాం. - రమేష్, వెలగతోడు

సమాధానం: పరిశీలించి వెంటనే చర్యలు చేపడతాం.

- వర్మ, పంచాయతీ కార్యదర్శి

- న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

సొంతింటి కల... నెరవేరే వేళ!

• బకాయిల విడుదలకు ప్రభుత్వ నిర్ణయం • లబ్ధిదారుల్లో ఆనందం

న్యూస్‌టుడే, మండపేట, రాయవరం

గతంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో ఇల్లు కట్టుకున్న వారికి బకాయి బిల్లులు చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు 2016లో తెదేపా ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకాన్ని ప్రవేశపెట్టింది. గ్రామీణ ప్రాంతంలో సొంత స్థలమున్న పేదలు, ప్రభుత్వ స్థలం కేటాయించిన లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో వారికి రూ. 2.50 లక్షలు గ్రాంటుగా ఇచ్చింది. ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని అనుసంధానం చేయడంతో తక్కువ ధరకు సిమెంటు, ఇసుక అందుబాటులోకి వచ్చింది. 2019లో వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత బిల్లులు చెల్లింపక పోగా, ఆ పథకాన్ని రద్దు చేసింది. అప్పటికే అప్పులు చేసి నిర్మించుకున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆర్థిక పరిస్థితుల కారణంగా కొంత మంది ఇల్లు కట్టుకోలేక మరికొందరు ఇళ్లను అసంపూర్తిగా వదిలేశారు. మండపేట నియోజకవర్గంలో 2016-2019 మధ్య ఇళ్లు నిర్మించుకున్న 2,063 మంది లబ్ధిదారులకు వైకాపా ప్రభుత్వం రాకతో రూ. 7.78 కోట్లు చెల్లింపులు నిలిచిపోయాయి. ఇప్పుడు సొంత స్థలమున్న పేదలకు, ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో ఇల్లు మంజూరయిన వారికి పట్టణ ప్రాంతాల్లో రూ.4 లక్షలు చొప్పున గ్రాంటు ఇచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



గొల్లపుంతలో అసంపూర్తి నిర్మాణాలు

మండలాల వారీగా వివరాలివీ...

మండలం	ఇల్లు కట్టుకున్న వారు	చెల్లించాల్సిన బకాయి (రూ.ల్లో)
మండపేట రూరల్	692	2,15,00,148
కపిలేశ్వరపురం	826	3,45,66,784
రాయవరం	545	2,19,06,593

నిధులు పెంచితే ఇల్లు కట్టుకుంటా..



గొల్లపుంత కాలనీలో స్థలం ఇచ్చినా ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇల్లు నిర్మించుకోలేదు. ఇప్పుడు రూ.4 లక్షలు ఇస్తారని అంటున్నారు. అలా గైతే నిర్మాణం మొదలుపెడదామని అనుకుంటున్నా.

- విస్సా శేషసాయి, మండపేట

అప్పుచేసి నిర్మించుకున్నా..



2016లో ఎన్టీఆర్ గృహ పథకంలో ఇల్లు మంజూరు కావడంతో పాత పెంకుటిల్లు తొలగించి నిర్మాణం చేపట్టాను. ఈలోగా ప్రభుత్వం మారడంతో బిల్లులు రాలేదు. ఇంకా ప్లాస్టరింగ్ పనులు చేయాల్సి ఉంది. బిల్లులు చెల్లిస్తే అప్పులు తీర్చి నిర్మాణం పూర్తిచేసుకుంటా.

- కుందేటి మేరీ, లొల్ల

పాత బకాయిలు చెల్లిస్తాం..

గతంలో నిలిచిపోయిన పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం అంగీకరించింది. అప్పుడు ఇల్లు కట్టుకోనివారికి ఇప్పుడు కొత్తగా నిధులు మంజూరు చేసేందుకు నిర్ణయించారు.

-కె.శ్రీనివాసరెడ్డి, ఇన్‌ఛార్జి డీఈ, గృహనిర్మాణ శాఖ, మండపేట

సమష్టి కృషితోనే పల్లెల్లో ప్రగతి

రాయవరం, న్యూస్‌టుడే: సమష్టి కృషితోనే పల్లెల్లో సమగ్ర అభివృద్ధి సాధ్యమని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. చెల్లూరులో బుధవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత వైకాపా పాలనతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో పడినప్పటికీ సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటోందన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన పనులను ఎమ్మెల్యే వివరించారు. తొలుత ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. పోషకాహారాన్ని పంపిణీ చేశారు. తక్కువ ఖర్చుతో తయారు చేసిన పోషక పదార్థాలను ప్రదర్శించారు. అనంతరం రైతు భవనంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని సంక్షేమ పథకాల గోడపత్రికను ఆవిష్కరించారు. గ్రామాల్లో వివిధ సామాజిక వర్గాల నాయకులు ఎమ్మెల్యే వేగుళ్లను సత్కరించారు. సర్పంచి పాలిక రాఘవ, ఎంపీటీసీ సభ్యులు గొల్లపల్లి అనూరాధ, వుండవిల్లి సుబ్బారాయుడు, మాజీ సర్పంచులు మోరంపూడి రాజ్‌కుమార్, నూనె శ్రీదేవి, వైఆర్‌కే పరమహంస, రిమ్మలపూడి వేణుగోపాలదొర, తెదేపా నాయకులు కొప్పిశెట్టి మాధవరావు, చుంద్రు వీర్రాజు, వుండవిల్లి రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ దేవు శ్రీను, నల్లమిల్లి వెంకన్నబాబు, ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి, ఎంఈవో యరమాటి సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



చెల్లూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రామచంద్రపురం: పట్టణంలోని పలు వార్డుల్లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అంకంవారి వీధిలో మూడో వార్డు కౌన్సిలర్ అంకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనపై వివరించారు. స్థానిక కూటమి పార్టీల నాయకులు, వార్డులో పెద్దలు పాల్గొన్నారు.

అంగరలో నేడు..

అంగర: కపిలేశ్వరపురం మండలం అంగరలో వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం ఉదయం 9 గంటలకు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొంటారని చెప్పారు.



ద్వారపూడిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ద్వారపూడి, న్యూస్‌టుడే: పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలంతా బాధ్యత తీసుకోవాలని జడ్.మేడపాడు సర్పంచి కంచర్ల చంద్రశేఖర్ అన్నారు. మండపేట మండలం జడ్.మేడపాడులో బుధవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో సిబ్బందితో కలసి తుప్పలు తొలగించారు. గ్రామ ప్రత్యేకాధికారి ఎ.రవిరాజు, పంచాయతీ కార్యదర్శి వి.అమర్‌నాథ్‌చౌదరి, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

✦ మండపేట మండలం ద్వారపూడి గ్రామంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ సిబ్బంది బుధవారం స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం కూడలి వద్ద చెత్త, తుప్పలను తొలగించారు. పంచాయతీ కార్యదర్శి ఆకుల వీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ద్రాక్షారామ: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సర్పంచి నాగిరెడ్డి సతీష్‌రావు తన సిబ్బందితో కలిసి వీధి నాటిక ప్రదర్శించారు. ఆయన రచించిన నాటికలో సర్పంచి పాత్రను పోషించారు. చెట్లు నరకడం వల్ల కలిగే ఉపద్రవాలు, చెత్త వేయడం వల్ల కలిగే అనారోగ్యాల గురించి వివరించారు. తొలుత పారిశుద్ధ్య కార్మికులతో గ్రామాల్లో వీధులను శుభ్రం చేయించారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతులతో అధిక దిగుబడులు

రాయవరం, న్యూస్‌టుడే: వ్యవసాయంలో శాస్త్ర, సాంకేతిక పద్ధతులను పాటిస్తే వరిసాగులో అధిక దిగుబడులు సాధ్యమని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ అన్నారు. బుధవారం లొల్లలోని రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన 'పొలంబడి' కార్యక్రమంలో వరిసాగు సస్యరక్షణకు చేపట్టాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. క్షేత్రస్థాయిలో ఎదరయ్యే సమస్యలపై అవగాహన కల్పించారు. సర్పంచి చాట్రాతి జానకీరాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు వైట్ల సతీష్, తెదేపా నాయకుడు సుంకవిల్లి గంగరాజు, ముప్పాటి కృష్ణ, అజయ్‌బాబు పాల్గొన్నారు.



లొల్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అంగర: కపిలేశ్వరపురం మండలంలో లంక గ్రామాలైన అద్దంకివారిలంక, కేదార్లంక గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి రమేష్‌కుమార్, కొత్తపేట ఉద్యాన అధికారి కోటేశ్వరరావు పాల్గొని ఉద్యాన పంటల సాగులో చేపట్టవలసిన మెలకువలను రైతులకు వివరించారు. అంతర పంటల వల్ల కలిగే ఉపయోగాలు, గోదావరి వరదల సమయంలో పంటల రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సర్పంచి వీధి వెంకటరెడ్డి, ఉద్యాన రైతులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: జగన్నాయకులపాలెం, ద్రాక్షారామలో మండల వ్యవసాయ అధికారి ఎన్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో వ్యవసాయ, జలవనరులు, ఉద్యాన, డ్రెయినేజీ, పశుసంవర్ధక శాఖల అధికారులు పాల్గొని రైతుల సందేహాలు నివృత్తి చేశారు.

దీన్‌దయాళ్ సేవలు చిరస్మరణీయం

పామర్రు: పండిట్ దీన్‌దయాళ్ అందించిన సేవలు చిరస్మరణీయమని భాజపా రాష్ట్ర కార్యదర్శి కర్రి చిట్టిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు ఎ.విరమణమూర్తి అన్నారు. అముజూరులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల సత్యనారాయణ, రామచంద్రపురం నియోజకవర్గ కో కన్వీనర్ సలాది శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో ఉపాధ్యాయ చిత్రపటానికి నాయకుల నివాళి

మండపేట: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి పురస్కరించుకుని మండపేటలో ఆయన చిత్రపటానికి భాజపా నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. నియోజకవర్గ భాజపా కన్వీనర్ కోటిపల్లి సాయిరామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు మద్దుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: పట్టణ భాజపా అధ్యక్షుడు కేశవ రాఘవేంద్ర ఆధ్వర్యంలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు గానాల కల్యాణ్, జిల్లా ఉపాధ్యక్షుడు యాండ్ర బుల్లబ్బులు, ట్రేడర్ సెల్ జిల్లా కన్వీనర్ కొట్టువాడ హరిబాబు తదితరులు దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

చెకుముకి సైన్స్ సంబరాలు

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలలు, రెండు ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. మొత్తం 454 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు వేదిక అధ్యక్ష, కార్యదర్శులు వాసంశెట్టి శ్రీనివాస్, పి.లెనిన్ బాబు తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అక్టోబరు 1న మండల స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.



టేకి ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ద్రాక్షారామ: రామచంద్రపురం మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. మొత్తం 18 ఉన్నత పాఠశాలల్లో 1,250 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు రూరల్ చెకుముకి కన్వీనరు రెడ్డి కనకరాజశేఖర్ తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు మండలస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పామర్రు: కె.గంగవరం మండలంలో పాఠశాల స్థాయి చెకుముకి పరీక్షకు 750 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల కన్వీనర్ పి.వి.బ్రహ్మానందం తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు, శ్రీధర్, రామలక్ష్మి, శ్రీనివాస, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెలికాని రామారావుకు నివాళి

రామచంద్రపురం: మాజీ ఎంపీ, దివంగత చెలికాని రామారావు వర్ధంతి సభను డాక్టర్ చెలికాని కృష్ణమోహన్‌రావు అధ్యక్షతన బుధవారం రాత్రి రామచంద్రపురంలో నిర్వహించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విచ్చేసి చెలికాని చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తొలుత చరిత్ర విశ్లేశకుడు కొప్పర్తి వెంకటరమణమూర్తి 'జాతీయత-భిన్న దృక్పథాలు' అంశంపై విశ్లేషించారు. సహకార ఉద్యమ నాయకుడు మానం ఆంజనేయులు, సీపీఐ రాష్ట్ర సహాయ కారయదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడారు. రైతుకూలీ సంఘం అధ్యక్షురాలు ఎస్.ఝాన్సీని సత్కరించారు. డాక్టర్ చెలికాని స్టాలిన్, డాక్టర్ రామారావు, కవిత దంపతులు చెలికాని రామారావు స్మారక కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న మంత్రి సుభాష్

ఉపాధ్యాయుడికి సత్కారం

అంగర: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఇటీవల అమలాపురంలో నిర్వహించిన టీచర్స్ ఒలింపిక్స్ పోటీల్లో షటిల్స్ (సింగిల్స్)లో మాచర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆర్.ఉదయకృష్ణ ప్రథమ స్థానంలో గెలుపొందారు. యూటీఎఫ్ మండల శాఖ తరపున బుధవారం పాఠశాలలో ఆయనను సత్కరించి, అభినందించారు. వచ్చే నెల 4, 5, 6 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టీచర్స్ ఒలింపిక్స్ పోటీల్లో జిల్లా తరపున ఆయన పాల్గొంటారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీవీ రాఘవులు, జిల్లా సహాధ్యక్షుడు పి.సురేంద్ర, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.శ్రీనివాస్, ఐ.సూరిబాబు, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

క్రీడాకారులకు ఆర్థిక సాయం

మండపేట, న్యూస్‌టుడే: ఈ నెల 30న జమ్మూకశ్మీర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి అండర్ 14 టెన్నికోయిట్ పోటీల్లో మండపేట వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్.గౌతమ్‌సంజయ్, బి.సత్యనారాయణ, కె.శివశంకర ప్రసాద్‌లకు పాల్గొననున్నారు. వీరు జమ్ముకశ్మీర్ వెళ్లి వచ్చేందుకు మండపేటకు చెందిన మహాత్మాగాంధీ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లమిల్లి విజయభాస్కరరెడ్డి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని బుధవారం పాఠశాలలో అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ఆర్.నాగకుమార్, వ్యాయామోపాధ్యాయుడు సీహెచ్ శ్రీనివాస్, కోచ్ కుంచె రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న విజయభాస్కరరెడ్డి

వైకాపా నాయకుడి మృతికి సంతాపం

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండల వైకాపా మండల కన్వీనర్ శీలం గోవిందు బుధవారం తెల్లవారుజామున అనారోగ్య కారణాలతో మృతిచెందారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రామచంద్రపురం నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ మాచరమట్టలు గ్రామంలో గోవిందు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటన్నారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, మాచర సర్పంచి సునీత, పలువురు వైకాపా నాయకులు సానుభూతి వ్యక్తం చేశారు.




గోవిందు భౌతికకాయానికి ఎమ్మెల్సీ తోట, సూర్యప్రకాష్ నివాళి

వాహనాల చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట గొల్లపుంత కాలనీకి చెందిన మేకా శివశ్యామ్, పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన అసెట్టి నగేష్‌ను అరెస్టు చేసి, వారి నుంచి 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు తెలిపారు. బుధవారం వీరిని ఆలమూరు జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచామన్నారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన పట్టణ ఎస్సై హరికోటిశాస్త్రి, రూరల్ ఎస్సై డి.సురేష్, సిబ్బంది ఎన్.సతీష్, జి.రమేష్, సత్యకుమార్‌స్వామిని ఎస్పీ అభినందించినట్లు తెలిపారు.

పురాతన ఆలయాలకు రక్షణ కరవు

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లిలో నవ జనార్దన స్వామి ఆలయాల్లో ఒకటిగా విరాజిలుతున్న జనార్దన స్వామి ఆలయం, చారిత్రక నేపథ్యం కలిగిన ఉగ్రనరసింహస్వామి ఆలయాలకు రక్షణ కరవైంది. భారీగా వర్షాలు పడితే ఆలయం ప్రాంగణంలోకి అడుగు పెట్టే పరిస్థితి లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయాల ఎదురుగా ఉన్న సీసీ రోడ్డు సుమారు రెండు అడుగుల మేర ఎత్తుగా ఉండటంతో వర్షం నీరు నేరుగా గర్భగుడిలోకి వెళ్లిపోతోంది. గర్భాలయం, అంతరాలయం బురదమయంగా మారిపోతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ మండపం స్లాబు తరచూ పెచ్చులూడి పడుతుండటంతో భయాందోళనలకు గురవుతున్నారు. స్వామివారిని ఉత్సవాల సమయంలో ఊరేగించే రథానికి ప్రత్యేక స్థలం లేకపోవడంతో, గుడి ఎదుట రహదారి పక్కన ఉంచి పరదాలు కప్పుతున్నారు. ఆలయాల వద్ద ఉన్న రథాలకు రక్షణ లేకపోవడంతో ప్రత్యేక శాల నిర్మించి ఆలయాన్ని పునర్నిర్మించాలని పలువురు భక్తులు కోరుతున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి కార్యనిర్వహణాధికారి ఎం.రాంబాబురెడ్డిని వివరణ కోరగా, పురాతన చరిత్ర కలిగిన ఆలయాలు కావడం వల్ల పునర్నిర్మాణం చేపట్టే అవకాశం తక్కువన్నారు. ఆలయంలో నీరు నిలిచిపోకుండా పనులు చేపట్టేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు చేపడతామన్నారు.



మండపంలో పెచ్చులూడుతున్న స్లాబు



ప్రత్యేక స్థలం లేకపోవడంతో రోడ్డు పైనే ఉంచిన రథం

నిందితుడికి ఏడాది జైలు

రాయవరం, న్యూస్‌టుడే: సోమేశ్వరంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో హుండీ పగలగొట్టి నగదు చోరీకి పాల్పడినట్లు రుజువు కావడంతో రాజమహేంద్రవారం పుష్కరఘాట్‌కు చెందిన ఓరుగంటి ఏసుకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ అనపర్తి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.వంశీకృష్ణ తీర్పునిచ్చారు. బుధవారం మండపేట గ్రామీణ సీఐ దొరరాజు తెలిపిన వివరాల ప్రకారం, 2022 అక్టోబర్ 10న జరిగిన చోరీపై ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.అయ్యపరాజు ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి ఎస్సై సురేష్ కేసు నమోదు చేశారు. అనపర్తి న్యాయస్థానంలో ఏపీపీ బి.సిద్ధార్థ వాదోపవాదనల్లో నేరారోపణలు రుజువు కావడంతో పాటు హుండీలో రూ.16 వేల నగదును చోరీ చేసినట్లు నిందితుడు అంగీకరించడంతో జైలు శిక్ష విధించారని సీఐ తెలిపారు. దర్యాప్తు చేసిన ఎస్సైలు సురేష్, బుజ్జిబాబు, కానిస్టేబుల్ సత్యకుమార్‌ను జిల్లా ఎస్పీ అభినందించారని చెప్పారు.